# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎన్ రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ వి.వి. ఆర్ ప్రసాదరావు

డా॥ యమ్ స్వర్ణముఖి



**సంపుటి 32 సంచిక 9**

**పేజీలు 40**

**మే 2013**

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M

చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన

చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by
C.V. Ramana Babu
on behalf of
YOGINI SRI CHANDRA
KALI PRASADA MATHAJI
CHARITABLE TRUST
and Printed at
Samardha Sadguru Publications,
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh and
Published at
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh, Editor
DUGGIRALA JAGANMOHANA
BALA KRISHNA LAL


| ***ఈ సంచికలో***............................ ....... | ***పేజీ*** |
|---|---|

| భద్రవాక్యం | 2 |
| యోగి వేమన | 3 |
| శ్రీబాబూజీ ఉవాచ | 4 |
| శ్రీమాతాజీ అభిభాషణ | 6 |
| సన్నిధిలో సంభాషణ | 8 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 10 |
| యోగవాశిష్ఠము | 11 |
| గురు కృపాహి కేవలమ్ | 13 |
| పరిప్రశ్నేన సేవయా | 15 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 16 |
| ధ్యాన మూలం గురోర్మూర్తిః | 18 |
| పిల్లల ఆధ్యాత్మిక కథ | 20 |
| బుద్ధ జయంతి | 21 |
| అంతరంగ నివాసి | 23 |
| శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వరప్రసాద బాబు రెసిడెన్షియల్ స్కూలు | 24 |
| త్యాగశీలి | 25 |
| బ్రజ్ మే రామధున్ | 28 |
| సత్యసంపద | 29 |
| శ్రీవిజయ నామ సంవత్సరాది | 31 |
| గురువుకు పరీక్షా? | 32 |
| శ్రీసద్గురు పుణ్యారాధన రజతోత్సవ వేడుకలు | 34 |
| సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర | 35 |
| శ్రీరాధామాధవ రస సుధ | 37 |
| విష్ణు కథలు | 38 |

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

సర్వమే నేహ హి సదా సంసారే రఘు నందన ।
సమ్యక్ప్ర యుక్తా త్సర్వేణ పౌరుషా త్సమవాప్యతే ॥

(వశిష్ఠ గీత)

మానవుడు ప్రపంచంలో ఏది పొందాలన్నా తమ ప్రయత్నం చేయక తప్పదు కదా. మహాత్ముల ఉపదేశానుసారము మనోవాక్కాయ ఇంద్రియాదులచే ఆచరించు ఏ కార్యమైనా ఉత్తమ పురుష ప్రయత్నంగా పిలువబడుతోంది, ఉత్తమ పురుష ప్రయత్నముచేత మానవునికి అలభ్యముకానిది ఏముంటుంది?

వశిష్ఠులవారు, అజ్ఞాన నివృత్తి కొరకు, సంసార భ్రమ నివారణకు శ్రీరామచంద్రుల వారికి ఉపదేశించిన ఉత్తమ పురుష ప్రయత్నమను సందేశము మానవాళికి సంసార సాగరము నుండి, శత్రు పంజరము నుండి బయుటపడే ఉపాయము సూచించినట్లయినది. మానవుడు తాను ఆచరించిన కర్మఫలమే ప్రారబ్ధముగా పరిగణింప బడుతోంది.



ప్రారబ్ధము పురుషప్రయత్నము చేత రహిత మవుతుందన్న విషయము శాస్త్రప్రమాణము. వివేకవంతమైన విచారణ, సత్సాంగత్యము, శ్రవణ మననాదుల చేత సఫలము కానిదేముంటుంది?

నిన్నటి దుష్కృత కర్మఫలము నేటి సుకృత కర్మ ఆచరణ ద్వారా శుభము ప్రాప్తించుట తథ్యము. సాధుజన సాంగత్యము చేయువారు శ్రవణమననాదులతో ఆత్మతత్త్వ విచారణ చేసేవారు దుష్టభోగేచ్ఛను ఎన్నడూ వాంఛింపరు కదా.

అటువంటివారికి ఆత్మసాక్షాత్కారము కరతలామలకము కదా! మహాత్ముల ప్రబోధము చేత ప్రాపంచిక వ్యవహారాలయందు అనాసక్తి, రాగద్వేషాలు, సుఖదుఃఖాల యందు సమబుద్ధి కలిగి, ఆత్మ సాక్షాత్కారము పొందటానికి పురుష ప్రయత్నము సుగమము కాక మరేమిటి?

*

# యోగి వేమన

గత సంచిక తరువాయి

- శ్రీ బులుసు వెంకటరమణయ్య

29. కఫము మీఱి మరియుఁ గనులు మూఁతలు పడి
బుద్ధితప్పి చాలఁబుడమి మరచు
వేళలందు నిన్ను వెదకుట సాధ్యమా?
విశ్వదాభిరామ వినురవేమ!

తాత్పర్యము -



కఫము ముంచుకొని వచ్చి, కనులు మూతపడి, తెలివి తప్పి, సర్వము మరచిపోవు కాలమున, దేవా! నిన్ను స్మరించుట సాధ్యము కాదు; దీనిని మూర్ఖుడు తెలియలేక యున్నాడు. దృఢముగా ఉన్నప్పుడే నిన్ను ధ్యానించవలె

30. కర్మగుణములన్ని కడఁబెట్టినడువమిఁ
దత్త్వమెట్లు తన్ను దగులుకొనును?
నూనె లేక దివ్వె నూవుల వెలుగునా?
విశ్వదాభిరామ, వినురవేమ!

తాత్పర్యము -

కర్మలను, రజ స్తమో గుణములను వదిలిపెట్టినగాని మానవుడు తత్త్వమును తెలిసికొనలేడు. దీపము నూనెతో వెలుగును కాని, నువ్వులతో వెలగదు కదా!

31. కల్లయైన జగమును గనుటెల్ల నిజమని
నమ్మి భ్రమఁకుజిక్కి నాతిఁగూడి
యెల్ల జనులు మరతురే కాంతుఁడగు హరి
విశ్వదాభిరామ, వినురవేమ!

తాత్పర్యము -

మూర్ఖులైన మనుజులు అసత్యమైన జగమునే నిజమని నమ్మి, స్త్రీతో కలియుచు భ్రాంతికి లోనయి భగవంతుని చూడలేకున్నారు.



# శ్రీబాబూజీ ఉవాచ

– పరాశర ప్రసాద్

శ్రీబాబూజీ మహరాజ్ భక్తులకు బోధ చేస్తూ సాధకునికి గురుమూర్తి అవసరమా? భగవంతుని దర్శనం పొందటానికి గురుమూర్తిని ఆశ్రయించవలసిన అవసరం ఏముంది? శ్రీ రమణమహర్షి ఏ గురువును ఆశ్రయించలేదు కదా! అని అడిగిన ప్రశ్నకు సమాధానముగా "మీరంతా చదువుకొన్నవారు మీలో లెక్చరర్లు, ఇంజనీర్లు, డాక్టర్లు వున్నారు. మరి మీరంతా ఎవరి సహాయం లేకుండానే మీ డిగ్రీలను పొందారా? మీరు పొందిన అక్షర జ్ఞానం ఎవరి సహాయం లేకుండానే, ఏ గురువునో ఆశ్రయించకుండానే పొందగలిగారా? మరి ఈ ప్రాపంచిక విద్యనభ్యసించడానికే గురువు అవసరమయినపుడు సాధకునిగా బ్రహ్మవిద్యను సాధించాలంటే గురువు అవసరమా కాదా! అన్న విషయం మీరే నిర్ణయించండి. మీరంతా చదువుకున్నవారు కదా! అవతార పురుషులయిన శ్రీరామ చంద్రుడు, శ్రీకృష్ణ పరమాత్ముడు గురుశిక్షణలో పెరిగిన వారే కదా!



పోనీ శ్రీరమణ మహర్షి విషయం తీసుకుందాం ఆయన అవతార పురుషుడు మహాత్ముడు. ఆయన గురువుని ఆశ్రయింప అవసరం లేని స్థితిని ఎలా పొందగలిగారో మీలో ఎవరైనా చెప్పగలరా! అది మీ సబ్జెక్ట్‌కాదు. జ్ఞానిని జ్ఞాని గుర్తించగలుగుతాడు కాని, మనలాంటి వాళ్ళు ఏం చెప్పగలుగుతారు? మద్రాసు పట్టణంలో ఏది ఎక్కడ వుందో దాని గురించి తెలుసుకొన్న అనుభవజ్ఞులు చెప్పగలుగుతారు. గాని మిగిలిన వారు ఏం చెప్పగలుగుతారు?"

శ్రీ బాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ "విశ్వామిత్ర మహర్షి సకల అస్త్ర, శస్త్ర, విద్యలన్ని తెలిసినవాడు. ఆయన యజ్ఞం నిర్వహించదలచాడు. ఆ యజ్ఞానికి అవరోధం కలిగించే రాక్షసులందర్ని తానే సంహరించగల సమర్థత వుంది కాని విశ్వామిత్ర మహర్షి శ్రీరామచంద్రుని సహాయం ఎందుకు కోరినట్లు? మనము నిర్వహించే ఏ కార్యమైనా భగవంతునికి సమర్పించి ఆయన సహాయాన్ని అర్థించి చేస్తే అది ఫలిస్తుంది. విశ్వామిత్రుని తపోశక్తిగాని, అస్త్ర, శస్త్ర విద్యలుగాని, భగవంతుడు ప్రసాదించినవేగా భగవంతుని అనుగ్రహంలేనిదే నువ్వు ఏపని అయినా చేయగలవా? గురుమూర్తి ప్రత్యక్ష పరమేశ్వరుడు సగుణ బ్రహ్మ. ఆయన అనుగ్రహం లేనిదే నీ కనురెప్ప కదల్చ గలుగుతావా? విశ్వామిత్రుడు అహంకారంతో ఈ విద్యలన్నీ నా తపోశక్తితో సాధించాను అని విర్రవీగలేదే? శ్రీరామచంద్రుడు అవతార పురుషుడు అని తెలిసినవాడు కాబట్టి, ఆయన సహాయం అర్థించాడు.

బజారునుండి సరుకులన్నీ తీసుకొస్తాం. వాటిని వినియోగించి ఒక పదార్థాన్ని మనవే తయారు చేస్తాం కాని ఆ పదార్థాన్ని భగవంతునికి సమర్పిస్తే ప్రసాదం అవుతుంది. భగవంతునికి అభిషేకించిన పవిత్రజలం తీర్థం అనిపించుకొంటుంది. మానవుడు

తన మేధస్సుని వినియోగించి ఎన్నో కొత్త విషయాలను తెలుసు కొంటున్నాడు. శ్రమపడి పెద్ద, పెద్ద కట్టడాలు నిర్మిస్తున్నాడు ఇదంతా మానవ శక్తి అనేగా మీరంతా భావించేది? మీరు మీ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయవచ్చు" అన్నారు.

శ్రీ బాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ "ప్రతిమానవుని ప్రజ్ఞని నేను సమర్థిస్తాను. ప్రతి మానవుడిలో ఒక ప్రత్యేకత ఉంటుంది. భగవానుడు ఒక్కొక్క మానవుడికి ఒక్కొక్క శక్తిని ప్రసాదిస్తాడు. ఒక వ్యక్తి చక్కగా పాడగలుగుతాడు. మరొకడు చక్కని రచనలు చేయగలుగుతాడు. కాని ఆ ప్రజ్ఞకి ఆధారం ఏమిటో ఎప్పుడైనా ఆలోచించారా! అది మనకు తెలియని రూప, నామ, క్రియ లేని ఒక శక్తి. దానినే ప్రజ్ఞానం బ్రహ్మ అని అంటారు. నీ దేహంలోని ఇంద్రియాలన్నింటిని సక్రమంగా పనిచేయించేది. ఆ శక్తే. నీకు ఆలోచనా శక్తిని ఇచ్చేది. మేధస్సుని ఇచ్చేది. ఆ శక్తే అని గుర్తించండి. దానిని ఈ క్షణంలోనే మీకు నిరూపణ చేయగలుగుతాను. ఇక్కడనే మనమధ్యనే వున్న పురుషోత్తంగారు చక్కగా పాడగలుగుతాడు. మంచిగాత్రం వుంది. ఎంతో సమర్థవంతంగా సత్యహరిశ్చంద్రలో పద్యాలు రాగయుక్తంగా పాడగలడు. ఈ ప్రజ్ఞ ఆయనదే అయినపుడు ఈ క్షణంలో ఆయనను పాడమనండి చూద్దాం?"

పురుషోత్తంగారు ఎంత ప్రయత్నించినా పాడలేకపోయారు. శ్రీబాబూజీ మహరాజ్‌కి నమస్కరించి తన అసమర్థతను తెలియజేస్తూ క్షమించమని కోరాడు. శ్రీ బాబూజీ మహరాజ్ ఆయనను ఆశీర్వదించి "చూశారా! మానవుని దేహం పరిణామముతో కూడినది. స్వయం ప్రకాశం లేనిది. ఎంతో చక్కగా పాడగల శక్తి కలిగివున్నా, మీ దేహం సహకరించటం లేదు. మరి ఆలోపం ఎవరిది? ఇక్కడ మీ ప్రజ్ఞ ఏమయినట్లు? మీ దేహ పరిణామము వలననే కదా పాడలేకపోతున్నారు. ఆలోపం సరియైన మరుక్షణం పాడగలుగుతారు కదా! ఈ ప్రజ్ఞ మానవుడిదేనని వాదించే మీ వాదన వీగిపోయినట్లేకదా!

ఇప్పుడు చెప్పండి మీరు ఈ దేహమా? ఎన్నటికికాదు లేక మీరు నేను, నాది అనుకొనేది కూడ ఈ దేహం కాదు అని గుర్తించండి. అదే ప్రజ్ఞానం బ్రహ్మ. మీ గొంతు పాడటానికి సహకరించక పోవడానికి నా ప్రమేయం ఏమీలేదు కదా! నన్ను అపార్థం చేసుకోరు కదా! అలా భావించినా ప్రజ్ఞ మీ దేహానిది కాదని అంగీకరించినట్లేగా! మానవుడు ఏదైతే తన ప్రజ్ఞ అని భావిస్తాడో అదే గురుశక్తి. ఈ విషయాన్ని గ్రహించిన పరిపూర్ణ విశ్వాసంగల సాధకులు కష్టాలు కలిగినపుడు దుఃఖించరు! సుఖం కలిగినపుడు ఉప్పొంగిపోరు. అసలు సుఖదుఃఖాలను గుర్తించేది మనస్సేకదా! ఆ మనస్సు జడమే. దానికి ప్రకాశాన్ని ఇచ్చేది గురుశక్తి అని తెలిసిన వాడికి దుఃఖమెందుకు కలగాలి? అంటే విశ్వాసంలో లోపమున్నదన్న మాట. దానిని సరిచేసుకొనే మార్గముంది. అదే గురుబోధా శ్రవణం. శ్రవణం చేసిన గురుబోధ సమయానికి మననానికి వచ్చి అది అనుభవింపచేస్తుంది. అటువంటి అనుభవము మీరు చేసిన గురుబోధా శ్రవణం యొక్క శ్రద్ధ మీద ఆధారపడివుంది. అటువంటి అనుభవమే శమ,దమాది, షట్క సంపత్తిలో సమాధానము అని అన్నారు. శ్రీ బాబూజీ మహరాజ్.

*

# శ్రీ మాతాజీ అభిభాషణ

-జపమాలా ప్రసాద

గత సంచిక తరువాయి

(స్పెయిన్ దేశములోని బార్సిలోనా నగరంలో ప్రపంచ మతాల మహాసభలు - 07-07-2004 నుండి 13-07-2004 వరకు జరిగినవి. కౌన్సిల్ ఫర్ పార్లిమెంట్ ఆఫ్ వరల్డ్స్ రెలిజియన్స్ వారు పూజ్యశ్రీ యోగినీ చంద్రకాళీప్రసాద మాతాజీ వారిని ఉ॥11.30-1.00 వివిధ మత సంబంధములను గూర్చి హిందూ బోధనలు అనే అంశముపై ప్రసంగించవలసిందిగా ఆహ్వానము పంపినారు.

12-07-2004 ఉదయం 11.30 గం॥లకు రూమ్ నెం.111లో, పై అంశంపై శ్రీమాతాజీ వారి దివ్య ప్రసంగము.

"నా గురుదేవులకు, వేదికనలంకరించిన పూజ్యపాదులు శ్రీ వేదభారతీ చిదానందస్వామీజీ వారికి, మీ అందరకూ నమస్కరిస్తూ...



ఈ రోజు ఇలాగ మీ అందరి ముందు కూర్చుని యీ విధంగా మాట్లాడుతున్నాను అంటే అది కేవలం నాలోవుండి నన్ను నడిపిస్తున్న ఆ అనంతశక్తి వల్లను, నా గురుదేవుల యొక్క పరమ అనుగ్రహము వల్లను మాత్రమేనని నొక్కి చెప్పగలను.

ఇక్కడ వివిధ దేశాలవారు, వివిధ మతస్తులు యింతమంది సమావేశమైయున్నా కూడా, అందరి యొక్క ధ్యేయము మాత్రము పరమమైన ఆనందాన్ని పొందాలి అన్నది ఒక్కటే. అందరూ సంతోషంగా ఉండాలనే కోరుకుంటారు. వ్యక్తిగతంగా అనుభవించే ఆనందాలు, సంతోషాలు వేరువేరుగా ఉండవచ్చునేమో గానీ, శాశ్వతమైనది మార్పులేనటువంటిది అయిన ఆనందం మాత్రం ఒక్కటే. అది కేవలం అనుభవైక వేద్యం. దానిలో వేరుతనమనేది లేదు.

మనం బయట నుండి చూస్తే, బిల్డింగ్ అంతా కనిపిస్తుంది. కానీ ఇప్పుడు మనమీ 111 నెంబరు గదిలో కూర్చుని వుంటే, బయట బిల్డింగ్ కనిపించడం లేదు. ఈ గది ప్రక్కన మరొక గది వుంది. అది వేరేగా వుండవచ్చు. అదే విధంగా ఈ ప్రపంచమంతా ఒక పవర్ (శక్తి) ఆవహించివుంటే, దానికి మానవుడు వేరు వేరు మతాలనీ, వేరు వేరు దేశాలనీ, ప్రాంతాలనీ కల్పించుకుంటున్నాడు. కానీ వాస్తవానికి ఇవన్నీ ఆ ఏకైక శక్తికి చెందినవే!.

ఒక్కొక్కరి మనస్సు, ఒక్కొక్క విధంగా సత్యాన్ని అనుభవిస్తుంది. ఎవరి

అనుభవం ఎలా వుంటే వారా విధంగా మాట్లాడతారు. కనుక, నాగురుదేవులు యిచ్చిన ఆదేశం మేరకు, నేను చెప్పేదేమిటంటే, "మతి మారితే అదే మతంగా మారుతుంది. ఇదే నిజమైన తత్వం". అందరమూ ఆ దివ్యశక్తిని అనుభవించాలనే యిక్కడ వున్నాం. కానీ వేరు వేరు మనస్తత్వాలు కలిగివున్నాం కాబట్టి, మన స్వభావాలు కూడా వేరు వేరుగా వుంటాయి.

ఏవిధంగా మనం నోట్లో కారం, తీపి, పులుపు యిత్యాది పదార్థాలని పెట్టుకుంటే ఆయా రుచులని అనుభవిస్తామో, మన మనస్సుని ఏయే గుణాలలో ఊరవేసి వుంచుతామో, ఆయా గుణాల రూపాన్ని మన మనస్సు పొందుతూ వుంటుంది. మన మనస్సు యొక్క భావాన్ని బట్టి మనం అనుభవాలని పొందుతున్నాము.

కనుక, యిక్కడున్నటువంటి మనము ఏ ప్రవక్త చెప్పిన మతమును1 ఆశ్రయించినా, ఏలక్ష్యమును, ఏ భగవంతుడిని ఆశ్రయించామో, ఏ సత్యాన్ని ఆశ్రయించామో, దానిలో లోతుకు వెళితే, లోపలున్నటువంటిది ఒక్కటే గాని, ఇన్ని రకాల మతాలు, దేవుళ్ళు, సత్యాలు లేవు అని మనకి ఆరూఢంగా తెలుస్తుంది. శ్రీ రామకృష్ణులు, అస్మద్గురుదేవులు శ్రీబాబూజీ మహరాజ్‌వారు, జీసస్ క్రీస్తు ప్రభువు, మహమ్మదు ప్రవక్త, స్వామి రామతీర్థ, ఎవరు చెప్పినాగానీ యిదే ఏకైక సత్యమని లోకానికి నొక్కి వక్కాణించారు. సర్వజీవులూ కూడా సమభావము కలిగి, పరస్పర అన్యోన్య సద్భావన కలిగి, కలసి మెలసి వుండాలని చాటి చెప్పారు.

మహాత్ములందరూ కూడా పరమమైన ప్రేమని గురించే చెప్పారుగానీ, మారిపోయేటటువంటి లౌకిక ప్రేమలను గురించి కాదు. మహాత్ములు చెప్పిన బోధలని ఎన్ని విన్నా ఎన్ని చెప్పుకున్నా, వారు చెప్పినవి మనము ఆచరించిన నాడే, వారు పొందిన దివ్యమైన అనుభవాన్ని మనం పొందగలుగుతాము గాని, 'నేను చాలా విన్నాను – చాలా నేర్చుకున్నాను' అంటే సరిపోదు. ఆ బోధ రూపాన్ని మనం పొందగలగాలి. మనందరము ఏశక్తిని ఉపాసిస్తున్నామో, దానియొక్క మూలాన్ని పొందడానికి ప్రయత్నం చేస్తే, అదే నిజమైన 'మతం' అవుతోంది.

అదే విధంగా మన మనస్సును విశాలం చేసుకుంటే విశ్వంలో వున్న అందరితో కూడా సోదరభావంతో, మాతా పితృ భావంతో మన జీవితాన్ని ఆనందమయం చేసుకోగలుగుతాము. ఒక సాకార రూపం దాల్చివచ్చి మన ప్రవక్తలందరూ ఆ పరమమైన విశ్వప్రేమని అనుభవించారు.

– సశేషం

# సన్నిధిలో సంభాషణ

– పరాశర ప్రసాద్

27.6.85

శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ "ఓడలో దిక్సూచి యొక్క ముల్లు ఎంత కదిపినా ఉత్తర దిక్కునే చూపిస్తుంది. అలాగే ఆనందాన్ని అనుభవించే మనస్సు ఇంక వేనినీ కోరదు. మనస్సు బుద్ధిలో లయించినప్పుడు ఇక ఏ ఆలోచనా ఉండదు. దానినే సమాధి స్థితి అంటారు. అట్టి సమాధి స్థితిలో కలిగే ఆనందం ఇంకే రకంగానూ లభించదు. అటువంటి ఆనందాన్ని పొందింపచేసేవారే గురుమూర్తి. కానీ ప్రకృతిని ఆశ్రయించిన మనస్సు ఎలా భ్రాంతిలో పడుతుందో మీకొక దృష్టాంతము చెప్తాను.



పెద్ద చదువుల నిమిత్తం అమెరికా వెళ్ళిన ఒక వ్యక్తి తిరిగి స్వదేశానికి వస్తున్నట్లుగా టెలిగ్రామ్ ఇచ్చాడు. అతని భార్య, పిల్లలు, బావమరుదులు ఆయన రాక కోసం ఆత్రంగా ఎదురు చూస్తున్నారు. ఆయనది పెద్ద భవనం. ఎత్తైన ప్రహరీ ఉంది. ఇంటి ముందు పెద్ద ఉద్యానవనం కూడా ఉంది. విమానాశ్రయం నుంచి కారులో ప్రయాణం చేసి కారు లోపలికి రావటానికి వీలులేని కారణంగా వీధిలోనే దిగి ఇంటిలోకి రాబోతూ గోడ మీద పడిన నీడను చూసి ఎవరో తనని హేళన చేస్తున్నాడని భ్రాంతి చెందుతాడు. ఇంకొంచం లోపలికి వెళ్ళేసరికి ఒక తాడుని చూసి సర్పమని భయపడిపోయాడు. అతని బావమరిది ఒకటే పరుగున ఒక కర్రని తీసుకువచ్చి దానిని కొడతాడు. ఇంకొక బావమరిది తన చేతిలో ఉన్న టార్చిలైట్ వేసేసరికి అంతవరకూ తను సర్పంగా భ్రాంతి చెందినది తాడే అని తెలుసుకుంటాడు. అలాగే మానవుడు ఈ ప్రకృతి, దేహము, ఇంద్రియాలు ఇవన్నీ కేవలము భ్రాంతియే అని తెలుసుకోగలుగుతాడు" అన్నారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ "మనస్సు ఏకాగ్రత చెందాలంటే దానిని విషయాదుల నుండి క్రమేపి పరమాత్మవైపుకు మరల్చాలి. ఒక కారులో ప్రయాణం చేసే వ్యక్తి సడన్‌గా బ్రేకు వేస్తే ఏమౌతుంది? దెబ్బలు తగలవచ్చు. లేకపోతే కారు బోల్తాపడవచ్చు. కాబట్టి గురునామాన్ని స్మరిస్తే ఆ స్మరణే తపస్సుగా మారి మనస్సుని శుద్ధి చేయగలుగుతుంది. గురుమూర్తి యందు భక్తి – విశ్వాసము ఉండాలి. అది ఎంత శక్తి కలిగిఉంటుందో మీకొక దృష్టాంతము చెప్తాను.

ఒక కృష్ణ భక్తురాలుంది. ఆమెకు ఒక్కడే కుమారుడు. ఆ పుత్రుడు ఆ ఊరికి సమీపాన ఉన్న పట్టణంలో చదువుతున్నాడు. అయితే ఆ పట్టణానికి చేరాలంటే ఒక అడవి మార్గం ద్వారా పోవాలి. ఆ అడవి కాకులు దూరని కారడవి చీమలు దూరని

చిట్టడవి. ప్రతిరోజు ఉదయం బయలుదేరి వెళ్ళి సాయంత్రం ఇంటికి చేరేవాడు. ఒక్కొక్కరోజు ఆలస్యం అయ్యేది. ఆ కుర్రవాడికి ఆ అడవి మార్గం గుండా ప్రయాణం చేయటానికి భయం వేసేది. ఒకనాడు ఆ విషయాన్ని తన మాతృమూర్తికి తెలియజేస్తాడు. ఆమె పుత్రుని కౌగలించుకొని 'నాయనా నీకు భయము వేసినప్పుడు మీ అన్నగారు కృష్ణుణ్ణి పిలువు తప్పక పలుకుతాడు' అని అంటుంది. 'అమ్మా అన్నయ్య ఎక్కడ ఉన్నాడు మనకి కనపడడేమి?' అని పుత్రుడు ప్రశ్నించాడు. ఆవిడ సమాధానం చెప్తూ 'అన్నయ్య నీ అంతరంగంగా ఉన్నాడు. అందరిలోనూ ఉన్నాడు. బాహ్య దృష్టికి కనబడడు కానీ మనము పిలిచినప్పుడు మనని రక్షిస్తాడు' అని ఆ తల్లి చెప్తుంది. ఆ బాలుడు ఆఖండ విశ్వాసంతో మనస్సుని ఆ కృష్ణపరమాత్మని యందే నిలిపాడు.

ఇలా ఉండగా ఒకనాడు అడవి మార్గం ద్వారా ప్రయాణం చేసేటప్పుడు మబ్బు వేసింది. ఉరుములు – మెరుపులు భీకరమైన వాన పడింది. ఆ బాలునికి భయం వేసింది. తల్లి చెప్పిన మాట స్ఫురణకు వచ్చింది. వెంటనే "కృష్ణా! అన్నయ్యా! ద్వారకీ వాసా!" అని సంపూర్ణ విశ్వాసంతో మనస్ఫూర్తిగా ఎలుగెత్తి పిలిచాడు. పరమాత్ముడు అట్టి పిలుపు కోసమే ఎదురు చూస్తాడు. వెంటనే శ్రీకృష్ణ భగవానుడు ఆ బాలుని పోలికలు కలిగిన వ్యక్తిగా, అన్నగా దర్శనమిచ్చి కౌగలించుకొని అతనిలో ఉన్న భయాన్ని తొలగించి ఇంటికి చేర్చాడు. చూశారా విశ్వాసమంటే అలా ఉండాలి. అట్టి విశ్వాసం ఉన్నవారికి లోటేముంది" అన్నారు.

*

## మూర్ఖులకు తెలియజెప్పటం వ్యర్థం

ఒకసారి ఒక మూర్ఖ వ్యాపారి తన గుఱ్ఱంపై ఒకవైపు రెండుమణుగులు గోధుమలు, మరొకవైపు రెండుమణుగుల యిసుక వేశాడు. అలా చేస్తే రెండు వైపులా సమాన బరువు ఉండి గుఱ్ఱానికి యిబ్బంది ఉండదని అతని అభిప్రాయం. ఒక పేద వ్యక్తి యిది చూసి 'మీరేమి వేస్తున్నారండీ?' అని అడిగాడు. దానికి శెట్టి 'రెండువైపుల సమానంగా ఉండాలని ఒకవైపు గోధుమలు, ఒకవైపు యిసుక మూటలు వేశాను' అన్నాడు. అప్పుడు ఆ వ్యక్తి 'ఒక మణుగు గోధుమ అటువైపు, ఒకమణుగు యిటువైపు వేస్తే సరిపోతుంది కదా?' అన్నాడు. దానికి ఆ వ్యాపారి విసుక్కుంటూ 'నీ దగ్గర ధనమెంత ఉంది?' అని అడిగాడు. అతడు తనకు తానే తప్పితే ఏమీ లేదన్నాడు. అది విని వ్యాపారి చిరుబరులాడుతూ 'నీవు నాతో మాట్లాడకు. నీతో మాట్లాడితే నేను కూడా నీలాగే పేదవాడిని అయిపోతాను. నీ బుద్ధినీ, నీ దురదృష్టాన్ని నీ దగ్గరే ఉంచుకో' అన్నాడు.

మూర్ఖులు మంచి మాటలను వినరు. అలాగే మనం కూడా మహాత్ములు కూడా జీవిత ధ్యేయాన్ని గురించి చెబుతూ ఉంటారు. కాని మనం వారి మాటలను లక్ష్యపెట్టక పతనమై పోతున్నాము.

# శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు

మే 2013

4 శని శ్రీగురుదశమి. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

8 బుధ మాసశివరాత్రి

15 బుధ శ్రీశంకరాచార్య జయంతి, శ్రీసద్గురు అష్టాదశ వార్షిక ప్రతిష్ఠా మహోత్సవము శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన

25 శని వైశాఖ గురు పూర్ణిమ, బుద్ధ జయంతి శ్రీసద్గురుపాదపూజ, సత్సంగ సమావేశము, భక్తసమారాధన

29 బుధ శ్రీమహాకాళికా పరమేశ్వరీసమేత శ్రీరామలింగేశ్వరస్వామి వార్షిక ప్రతిష్ఠా కళ్యాణ మహోత్సవము.

జూన్ 2013

3 సోమ శ్రీగురుదశమి, హనుమజ్జయంతి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

6 గురు మాసశివరాత్రి

17 సోమ శ్రీసుగుణ ప్రసాదమాతాజీవారి షష్టమ వార్షిక పుణ్యారాధన

23 ఆది పూర్ణిమ శ్రీ సద్గురుపాద పూజ.

## పూజ్య యోగిని శ్రీ చంద్ర కాళీప్రసాదమాతాజీవారి విదేశ పర్యటన వివరములు

28-5-2013 నుండి 5-6-2013 వరకు డెన్మార్క్

6-6-2013 నుండి 15-6-2013 నార్వే

16-6-2013 నుండి 17-7-2013 అమెరికా సంయుక్త రాష్ట్రాలు

(గత సంచిక తరువాయి)

# యోగవాశిష్ఠము

-సుషుమ్న ప్రసాద

శుకమహర్షి వచ్చినట్లు, ద్వారపాలకుడు జనకమహారాజుకు వార్తను అందజేశాడు. కాని జనకుడు శ్రీశుకుని స్థితప్రజ్ఞత్వమును పరీక్షించాలనే ఉద్దేశంతో ఆయనకు స్వాగతం పలకటానికి ముఖద్వారం వద్దకు వెళ్ళకుండా, ద్వారపాలకుణ్ణి ఆయనను సాదరంగా రాజప్రాసాదంలోకి తీసుకుని రమ్మనమని చెప్పకుండా మిన్నకున్నాడు.



అలా సింహద్వారం వద్ద నిద్రాహారాలు లేకుండా ఏడు రోజులు వేచి ఉన్నాడు. తరువాత శుకమహర్షిని రాజప్రాసాదంలోకి తీసుకువెళ్ళారు. అక్కడ కొంతమంది అంతఃపుర కాంతలు పుష్పాలతో, పరిమళ ద్రవ్యాలతో, చందనంతో ఆయనను అభిషేకించి, షడ్రశోపేతమైన భోజనం పెట్టారు. కానీ యీ సత్కారాలేవీ శుకమహర్షిని కించిత్ కూడా చలింపలేక పోయాయి.

నిరాహారంగా, నీరసించిన సమయంలోను, అద్భుతమైన అతిథి సత్కారాలతో ఆహ్వానించిన సమయంలోను ఆయన ఒకే విధంగా నిశ్చలమనస్కుడై ఉన్నాడు. నిందా స్తుతులను, సుఖదుఃఖాలను సమదృష్టితో స్వీకరించాడు. జనక మహారాజు తన పరీక్షలో విజయం సాధించిన శుకమహర్షి నిత్యానంద శిఖరాన్ని చేరుకొన్నాడని గ్రహించాడు.

జనక మహారాజు వెంటనే లేచి శుకమహర్షికి అంజలి ఘటించి, “మీరు జీవిత ధ్యేయాన్ని సాధించారు. ప్రాపంచిక విషయాలలో పూర్తిగా నిరాసక్తులై వాటిని త్యజించి, బ్రహ్మానంద ఫలాన్ని అందుకున్నారు. మహాత్మా! మీరు నా వద్దకు ఎందుకు వచ్చారో తెలియజేయండి. మిమ్మల్ని సేవించటానికి సంసిద్ధుడనై ఉన్నాను” అన్నాడు.

వెంటనే శుకమహర్షి ఇలా ప్రశ్నించారు “మాయ ఎక్కడి వచ్చింది? అది ఎలా వృద్ధి పొందుతున్నది? మరల యెలా నిర్మూలమవుతున్నది? నాకు వివరంగా చెప్పండి” అన్నారు.

జమకమహారాజు వ్యాసమహర్షి చెప్పినదానినే మరలా చెప్పారు. అప్పుడు శుకమహర్షి “ఈ జ్ఞానమంతటిని నా అతీంద్రియ శక్తితో ఎప్పుడో గ్రహించాను. మా తండ్రిగారు కూడా అదే సమాధానాన్ని చెప్పారు. శాస్త్రాలు, పండితులు అదే చెప్పారు. మీరు కూడా అదే విషయాన్ని ప్రబోధించారు. కాని బ్రహ్మము నుండి ఉత్పన్నమై, నశించే మాయవలన కించిత్ అయినా ప్రయోజనం లేదు. అది తిరిగి బ్రహ్మలోనే లయమవుతోంది. ఆత్మ లేక బ్రహ్మ స్వభావాన్ని గురించి చక్కగా వివరించండి” అని ప్రార్థించాడు.

జనకమహారాజు ఇలా సమాధానం చెప్పాడు "ఉన్నది నాశరహితము, అఖండము, అవిభాజ్యము, స్వయం ప్రకాశమైన బ్రహ్మము ఒక్కటే. ఆయన సంపూర్ణ చిదాకాశముగా, సర్వవ్యాపకుడై ఉన్నాడు. బ్రహ్మము మినహా మరొకటి లేదు. జ్ఞానము సంకల్పముతో బంధింపబడి, సంకల్ప నిర్మూలనముతో ముక్తిని పొందుతోంది.

నీవు ఆ పరబ్రహ్మ స్థితిలోనే ఉన్నావు. నీవు పరిపూర్ణమైన ఆత్మజ్ఞాన స్థితిలో ఉన్నావు. అందుచేతనే నీకు విషయాదులమీద, ఇంద్రియ సుఖాలపట్ల అనురక్తికాని, అనుబంధము కాని లేవు. నీవు దేనిని సాధించాలో అది సాధించావు. నీవు అన్ని కోరికలను సాధించిన నాయకుడవు. సంపూర్ణంగా పరమాత్మలో లయమైన జీవన్ముక్తుడవు."

అలా ప్రబోధించి జనక మహారాజు శుకమహర్షికి ఆత్మతత్త్వోపదేశం చేశాడు. శ్రీశుకుడు తన మనస్సును పరమాత్మపై కేంద్రీకరించి, మౌనంగా ఉండిపోయాడు. అన్ని సందేహాలు, చీకాకులు పటాపంచలైపోయాయి. మాయా శంకలు నుండి విముక్తుడై సహస్రవర్షములు నిర్వికల్ప సమాధి స్థితిలో ఉన్నాడు. ఒక నీటి బిందువు సముద్రములో లయమైనట్లు శుకుడు పరమాత్మలో లేదా పరమానంద సముద్రంలో లయమైపోయాడు.

– సశేషం

శ్రద్ధాంజలి

శ్రీబాబు పరమభక్తులు, కట్టమూరు వాస్తవ్యులైన శ్రీమతి మందడి ఛాయమ్మగారు 26-3-2013 మంగళవారంనాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 70సం॥లు. వీరికి భర్త, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు, మనుమలు, మనుమరాళ్ళు కలరు.

శ్రీ సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.



అష్టదళోపరివేష్టిత లింగం
సర్వసముద్భవ కారణ లింగం
అష్టదరిద్ర వినాశక లింగం
తత్ప్రణమామి సదాశివలింగం

# గురుకృపా హి కేవలమ్

గత సంచిక తరువాయి - సుశీల ప్రసాద

ఒక సంవత్సరం పౌర్ణమికి శ్రీశైలం వచ్చిన భక్తులతో తన బసలో విశ్రాంతి తీసుకుంటూ శ్రీహరి సుశీలచేత పాట పాడించి పాండన్నయ్యతో రికార్డ్ చేయిస్తున్నారు. అంతలో చి॥ చంద్ర (మాతాజీ)ను రాఘవమ్మగారు రెండు జడలు వాటి నిండా పూలుపెట్టి, కళ్ళ నిండుగా కాటుక పెట్టి, బోలెడు నగలు పెట్టి అలంకరించారు. బంగారు బొమ్మలా ఉన్న చంద్ర గలగల మని పరుగెత్తుకుంటూ వస్తూ గదిలోకి 'పెద్దబ్బాయి గారూ!' అని పిలుస్తూ పరుగెత్తుకుని వచ్చినందున ఆయాసపడుతూ, చేతులు తిప్పుకుంటూ "మరే! నేనూ చిన్నబ్బాయిగారు (చిరంజీవిరాజు గారు) కలిసి గుళ్ళోకెళ్ళాము. అక్కడేమో గవర్నర్ త్రివేది వచ్చారు. ఆయన్ని చూశాము" అంటూ ఏకబిగిన చెప్పింది. శ్రీబాబు చిట్టితల్లిని ఒడిలోకి తీసుకుంటూ "అలాగా! ఏది మళ్ళీ చెప్పు వింటాను" అంటూ టేప్ రికార్డర్ మైకును చంద్ర నోటి దగ్గర పెట్టారు. ఆ చిన్నారి తేనెలాంటి పలుకులు రికార్డ్ అయ్యాయి. చంద్ర ఆపిన వెంటనే రికార్డ్ ఆన్‌చేశారు. తను చెప్పిన మాటలు తానే వింటూ అలా ఆశ్చర్యంగా కళ్ళుపెద్దవి చేసి ఉండిపోయింది ఆ చిన్నారి తల్లి!

మరి భవిష్యత్తులో శ్రీకాళీవనాశ్రమ పీఠాధిపతి అయి, దేశవిదేశాలలో తన అనుగ్రహ భాషణలు, దివ్యబోధామృతం వినిపించేకాలం, ఎల్లకాలం భక్తుల హృదయాలలో చెరగని ముద్రవేసే ఆ తల్లి తన పలుకుల తీపి రుచి చూపించారని నాడే సర్వజ్ఞ సర్వేశ్వర శ్రీగురునాధులకి తెలుసుమరి. వినగల చెవులలో ఆ దివ్యవాణి మారుమ్రోగుతూ ఉంటుందని సర్వాంతర్యామి అయిన స్వామికే ఎరుక!

చీరాల సముద్ర స్నానానికని కార్తీక పౌర్ణమికి శ్రీబాబు భక్తబృందాన్ని తీసుకుని వెళ్ళేవారు చీరాలలో శ్రీ నూనె వెంకటస్వామిగారింట్లో శ్రీబాబు బసచేసి ఉన్నారు. భక్తులంతా అక్కడే ఉన్నారు. స్వామి తమ గదిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. గది బైట కూర్చుని ఇద్దరు ముగ్గురు భక్తులు ధ్యానం చేసుకుంటున్నారు. ఒక భక్తుడు మోకాళ్ళ మీద తల ఆన్చి నిశ్చల ధ్యానస్థితిలో ఉన్నాడు. అంతలో స్వామి గదితలుపులు తెరచి బయటకు వచ్చారు. గురుమూర్తి దర్శనంతో అక్కడ భక్తులంతా ఆనందంతో లేచి నిలబడ్డారు. కానీ ఆ భక్తుడు మాత్రం లేవలేదు.

శ్రీబాబు నవ్వుతూ చూస్తూ, ఇంటివారిని తమ స్నానానికి నీళ్ళు సిద్ధం చేయమన్నారు. ఇక సందడి ప్రారంభమైంది. గదిగుమ్మంలో బాబు నిలబడే ఉన్నారు. పెద్దపెద్ద బక్కెట్లతో బాబు గదికి ప్రక్కనే ఉన్న స్నానాల గదిలోకి నీళ్ళు జేరవేస్తున్నారు. అక్కడ చన్నీళ్ళతో ఉన్న గుండిగలు, బకెట్లు పెద్దపెద్ద చప్పుళ్ళు చేస్తున్నాయి. ఈ సామాగ్రి

ధ్వనులు, మనుష్యుల సందడి ఆ భక్తుని ఏమీ కదిలించలేక పోయింది. అతడు అలాగే కూర్చున్నాడు.

శ్రీబాబు నవ్వుతూ "మాయ! అంతా మాయ! ఔను మాయ!" అని పలుసార్లు పలికారు. అయినా అతను కదలలేదు. అందరూ నవ్వుతున్నారు. శ్రీబాబు కూడా నవ్వారు. 'దైవీ హ్యేషా గుణమయి మమ మాయా దురత్యయా' అన్న గీతాచార్యులై నవ్వుతున్నారు. కొందరు అతన్ని తట్టి లేపారు. శ్రీబాబు ఇక తన లీల చాలించి, స్నానానికి అటు వెళ్ళగానే, ఆ భక్తుడు చివ్వున కళ్ళు తెరచి ' ఏమైంది?' అని అడిగాడు. తన దైన మాయను అలాగ ప్రయోగించి, దాని ప్రభావం ఎంత గొప్పదో భక్తులకి రుజువు చేసి చూపారు ఆనాడు శ్రీసద్గురునాధులు.

-సశేషం



శ్రీకాళీవనాశ్రమము జలగావ్ బ్రాంచిలో 21-3-2013 గురువారం నాడు శ్రీబాబు దివ్యమంగళ మూర్తి ప్రతిష్ఠ పంచమ వార్షిక మహోత్సవ సందర్భంగా శ్రీసద్గురుపాదపూజ జరుగుతున్న దృశ్యం

# పరిప్రశ్నేన సేవయా

- పరాశర ప్రసాద్

శ్రీసద్గురుదేవులు అమెరికాలో భగవంతుని తత్త్వవిచారణలో ఉండగా, ఒక డాక్టరుగారు ప్రశ్నిస్తూ "మీరు భగవంతుని దర్శించారా?" అని అడిగారు.

శ్రీబాబు సమాధానం చెబుతూ, "నన్ను దర్శించారా?' అని అడిగారు కాబట్టి మీరు దర్శించలేదని గోచరిస్తోంది" అనే సరికి, ఆయన ముఖ కదలికలలో మార్పు వచ్చింది. ప్రశ్నించినప్పుడు వ్యంగ్యంగా నవ్వుతున్నట్లనిపించింది. భగవంతుడు లేడు అన్నట్లుగానూ ఉంది.

సంభాషణని కొనసాగిస్తూ, సద్గురుదేవులు డాక్టరుగారిని ఉద్దేశించి, "మీ జేబులో అగ్గిపెట్టె ఉన్నదికదా, ఆ అగ్గిపెట్టెలోని అగ్గిపుల్లలో తేజస్సు ఉంది అని నేను అంటున్నాను. అయితే ఆ అగ్గిపెట్టెమీద అగ్గిపుల్లతో రాపిడి చేయకుండా తేజస్సుని చూపించగలుగుతారా?" అనేసరికి ఆయన క్రోధంగా, నిస్సహాయంగా నా వంక చూశారు.

అలాగే ప్లగ్ ముట్టుకోకుండా, స్విచ్ వేయకుండా తీగలో కరెంట్ ఉందో లేదో చెప్పగలరా? అంతెందుకు మీకు నేను ఒక ఉదంతం చెబుతాను. నేను రోడ్డు మీద నడుస్తుండగా నాకెదురుగా ఒక వ్యక్తి వస్తూ నన్ను ఢీకొని 'ఏమయ్యా! నీకు కళ్ళు కనబడటం లేదా?' అన్నాడు. నేను వెంటనే ఆ వ్యక్తిని తిరిగి ప్రశ్నించాను. "నా సంగతి అలా ఉంచు. నీకు కళ్ళు ఉన్నాయిగా మరి నన్ను ఎందుకు ఢీ కొన్నావు?' అని ప్రశ్నించేసరికి, 'నా నెత్తిన యీ మూట ఉంది అందువలన చూడలేకపోయాను' అన్నాడు అని చెప్పి సద్గురుదేవులు సంభాషణ కొనసాగిస్తూ......

"చూశారా! అగ్గిపుల్లలో తేజస్సును దర్శించటానికి రాపిడి కావాలి, అలాగే వైరులో కరెంట్ ఉందో లేదో తెలుసుకోవటానికి స్విచ్ వేయాలి. కళ్ళు మూసుకున్నవాడికి తనకి ఎదురుగా ఉన్న దృశ్యం గోచరించదు. మరి భగవంతుని దర్శించాలంటే ఏ ప్రయత్నమూ లేకుండా సాధ్యపడుతుందా!

అంతెందుకు మీరు డాక్టరే కదా! నిత్యమూ మీరు అనుభవించే కడుపునొప్పిని ఏ పరీక్ష చేయకుండా చెప్పగలుగుతారా? ఏదీ మీ కడుపునొప్పిని నాకు చూపించండి. అది కేవలము మీ అనుభవమే కదా! దానికి రూపం ఉందా చెప్పండి?" అనేసరికి డాక్టరుగారు మెత్తపడ్డారు. అక్కడితో వాదన ముగిసింది.

మూడు రోజుల తరువాత డాక్టరుగారు సద్గురుదేవుల దర్శనార్థం ఎవరి కంట పడకుండా వచ్చి "మీరు చెప్పినదానిలో సత్యాన్ని గ్రహించటానికి ప్రయత్నం చేస్తాను" అన్నారు.

*

గత సంచిక తరువాయి

# శ్రీకృష్ణ కర్ణామృతం

– సుశీలా ప్రసాద

27 శ్లో. అధీర మాలోకిత మార్ద్ర జల్పితం
గతం చ గమ్భీర విలాస మన్దరమ్,
అమన్ద మాలి జ్గిత మాకులోన్మద స్మితం
చ తే నాథ వదన్తి గోపికాః ॥



తాత్పర్యము – కృష్ణా! గోపాంగనలు నీ బెదురు చూపులను, తీయని పలుకులను, గరువంపు విలాసముచేత మందమైన నడకను, గాఢమైన కౌగిలింతను, వెల్లివిరిసే మోహజనకమైన చిరునవ్వును వర్ణించి చెప్పుకుందురు.

"సూరీడు ఇవాళ తొందరగా వచ్చేశాడు ఎందుకమ్మా?" అని చిన్నపిల్ల సన్నని గొంతుతో అడుగుతోంది తల్లిని. సూర్యుడొచ్చి తెల్లవారితే తల్లి తనని వదలి ఆహారంకోసం దూరంగా పోతుందని బెంగతో బిక్కమొహంతో. "చిన్నా! అదిగో చూడు! మనలాగే తల్లీ బిడ్డలు యశోదమ్మ కన్నయ్యలు. అమ్మ కన్నయ్యకి స్నానం చేయిస్తుంటే చూడాలని ఉబలాటపడిపోతూ సూర్యుడు పెందరాళే వచ్చేశాడమ్మా" అంటున్నదాతల్లి.

వాళ్ళ మాటలు వింటున్న భానుడు పొడుపు కొండ మీద నిలచి నవ్వుకున్నాడు. "ఔను కదా! లేత నీలిరంగు ఒంటి మీద నుంచి నీళ్ళు జారి పడుతుంటే, ఆ సుకుమార శరీరం మీద నుంచి జారుతున్న నీటిబిందువులను నా తొలి కిరణాల వెలుగుతో వజ్రాల హారాలుగా మెరిపిస్తూ, వాళ్ళమ్మకంటె ముందే చిన్ని కృష్ణుని నేనే అలంకరించేద్దామని నా తొందర మరి" అనుకుంటున్నాడు.

పైడి చెంబుతో నీళ్ళుపోస్తున్న తల్లి చేతి ప్రక్కనించి తలెత్తి గోపబాలుడు చెట్టు మీద కూర్చుని మాట్లాడుకుంటున్న పాలపిట్టల వంక ప్రేమగా చూశాడు. కన్నయ్య అలా చూసేసరికి, ఆ పిట్టలు ఆనందంగా కిలకిల లాడాయి. ఆ వెనక ఇంకా కళ్ళు పైకెత్తి ఆకాశంలో సూర్యుని వంక చూశాడు మెచ్చుకోలుగా.

తన సేవని స్వీకరించిన విశ్వ విభుని చూసిన సూర్యుడు మురిసిపోతూ "ధన్యుణ్ణి దేవా! మీ అనుగ్రహంతో ముందడుగు వేస్తూ నేను సాగిపోతున్నాను" అన్నాడు. "అలాగ కళ్ళు తెరచుకుని కూర్చుంటే నీళ్ళు పోసేటప్పుడు పన్నీరు కళ్ళలో పడి మండిపోదూ? మళ్ళీ ఏడుస్తావు" తల్లి కొడుకుని కోప్పడింది. ఆవిడకేం తెలుసు? సర్వ ప్రకృతికి తన తనయుడు అధిపతి అని. సృష్టి అంతా వాని చూసి మురిసిపోతూ ఉంటుందని!

యశోదమ్మ నందయ్య వేసుకునే పైమీది మెత్తని ఉత్తరీయంతో కన్నయ్య ఒళ్ళు తుడుస్తోంది. పిల్లాడికి ఒళ్ళెక్కడ కందిపోతుందో అని ఆవిడకి భయం. ఆవేళకి వీధిలో పొలానికి పోతున్న ఎడ్ల మెడలో గంటలు గణగణ మంటూ వినిపించాయి. క్షణంలో సగంసేపు చెవి అటుకేసి పడేసిన కన్నయ్య "అమ్మా! ఇందాక నువ్వు పెరుగు చిలుకుతూ కవ్వం అక్కడే పడేసి వచ్చావు కదే! ఆ కవ్వం మీద వెన్న ఇప్పుడే తీసి ఇవ్వు తింటాను" అన్నాడు.

"అదెందుకురా? ఉట్టిమీద పిడతలో తీసిన వెన్న కావలసినంత ఉండగా" అంటున్న తల్లిమాట వినకుండా, "అదే కావాలి... అదే కావాలి..." అని మారాం మొదలు పెట్టాడు. కొడుకు మాటలకి విసుక్కుంటూ "నువ్వు పట్టిన పట్టు విడవ్వు కదా!" అంటూ లోపలికెళ్ళింది యశోదమ్మ. ఒళ్ళు తుడుస్తున్న ఉత్తరీయం మొలకు చుట్టుకుంటూ వీధిలోకి పరుగుదీశాడు కన్నయ్య.

బాట మీద ఎడ్లు నడుస్తున్నాయి. వృషభ గమనుడైన శ్రీకృష్ణుడు వాటికంటె ముందుగా నడుస్తుంటే, ఆ యింటి, యీ యింటి పొరుగింటి గోపెమ్మలంతా ముద్దుల బాలుని అందాలన్నీ చూస్తూ కళ్ళింతలు చేసుకుని నిలబడ్డారు. గంభీరంగా, వయ్యారంగా, విలాసంగా, నెమ్మదిగా వయ్యారాలు పోతూ నడుస్తున్న వాని నడకలు గోపికల మనసులలో చెరగని ముద్రలు వేస్తున్నాయి. ఆ క్షణంలోనే వెనుక నడుస్తున్న ఎద్దు ఒకటి అదుపు తప్పినట్లు, అసురావేశం కలిగినట్లు ముందుకాళ్ళు పైకెత్తి గాలిలోకి ఎగిరింది.

వెంటనే కృష్ణయ్య అది చూసి, దాని కాళ్ళు పడేచోట ఉన్న చిన్నబాలుని ఒక చేత్తో పక్కకి నెట్టేసి, రెండో అరచేత్తో ఎద్దు కాలిగిట్టలను అదిమిపట్టి వెనక్కి తోసేశాడు. ఎద్దు వెనక్కి పడింది." పిల్లవాడు బ్రతికాడు. కిట్టయ్య రాకపోతే పిల్లాడు చచ్చిపోయి ఉండేవాడు" అంటూ ఆ బాలుని తల్లి కళ్ళనీళ్ళు కారుస్తూ పసివాణ్ణి కృష్ణుని కాళ్ళమీద పడేసింది. చుట్టూ మూగి వింత చూస్తున్నవారిలో నుండి బలరాముడు ముందుకు వచ్చాడు.

"అన్నయ్యా! ఒక జీవికి ఒక సంకల్పం కలిగే ఆరునెలల ముందుగానే నాకు తెలుస్తుంది సుమా!" అన్నాడు కన్నయ్య బలరామునితో. "అందుకేనా అస్తవ్యస్తంగా కట్టుకున్న వస్త్రంతోనే అంత హడావిడిగా బయటకు వచ్చావు" అన్నాడు బలరాముడు. "ఇప్పుడీ ఎద్దులో దూరిన రాక్షసుడు నా చేతిపోటుకి క్రిందపడి మట్టిలో కలిసిపోయాడు లే! ఇక ఈ ఎద్దు తనకి తెలియకుండా జరిగినదానికి ఎలా కన్నీరు కారుస్తోందో చూడు!" అన్నాడు గోపాలుడు. సర్వమూ నీకే ఎరుక!" అన్నాడు బలరాముడు. వారిద్దరి సంభాషణ వినే శక్తి అక్కడున్న ఎవరికీ లేదు.

– సశేషం

# ధ్యానమూలం గురోర్మూర్తిః

- రమణ ప్రసాద్

(మౌన ధ్యాన శిబిరంలో చేసిన శ్రీమాతాజీవారి ప్రసంగాల నుండి)

గురుదేవులకు మనం అనేక రీతులుగా చేసే సేవ ధ్యానమే అవుతుంది. మనం చేసే క్రియా కలాపాలు ధర్మ సమ్మతంగా ఉంటే అవి బంధన కాదు. కాని అక్కడ కర్తృత్వం ఉండకూడదు. 'నేను ఎప్పుడూ ధ్యానంలోనే ఉంటానండీ, ఎప్పుడూ భగవద్దృష్టి లోనే ఉంటాను' అని చెప్పుకుంటే అది నిజమైన ధ్యానం కాదు. అనుభవైకవేద్యమైనది ధ్యానము. గురుదేవులేమన్నారంటే "అన్నీ తెలిసి ఉండాలి. కాని తెలిసినట్లు యితరులకు తెలియనక్కర్లేదు" అని. ధ్యానం ఒక్కడివే చేసుకోవాలి. కాని ప్రబోధం పదిమందితో కలిసి చేయాలి. ప్రేమ విశ్వాసాలను పెంపొందించుకోవాలి. గాఢ నమ్మకము, పరమమైన ప్రేమయే భక్తి. ప్రతి విషయంలోనూ గురుదేవులకు యిది యిష్టమా? కాదా? అని చూడాలి.

సమర్థ రామదాసు వద్ద అజ్ఞాన్ అనే శిష్యుడు ఉండేవాడు. ఒకసారి సమర్థులు శిష్యులందరితో కాశీకి వెళ్తూ "అజ్ఞాన్! నీకు కాశీకి రావాలని లేదా?" అని అడిగారు. అజ్ఞాన్ "నాకు మీ గురుపాదాలే కాశీ. గురుపాద తీర్థమే గంగ. మీరు కాశీకి వెళ్ళినప్పుడు నేను సీతారాములకు అర్చన చేసి నైవేద్యం పెడతాను" అన్నాడు. అజ్ఞాన్ ఆ మరునాడు వంట చేసి, సీతారాముల ముందు పెట్టి "నైవేద్యం స్వీకరించు స్వామీ!" అంటే స్వామి ఎంతకీ రాలేదు. "నా గురుదేవులైతే నేను నైవేద్యం పెట్టగానే స్వీకరించేవారు. నాకు కొంచెం భుక్తశేషం కూడా ఉంచేవారు, కానీ నువ్వు ఎంతకీ రావటం లేదు" అని తలబాదుకోవటం మొదలు పెట్టాడు. రామచంద్రుడు ప్రసన్నుడై వచ్చి నైవేద్యాన్ని స్వీకరించాడు.

ఇలా రెండు రోజులు గడిచాయి. అప్పుడు అజ్ఞాన్ రామచంద్రుడితో "కష్టపడేవాడే కైంకర్యం స్వీకరించటానికి అర్హుడు" అనేవారు మా గురుదేవులు. "అయితే ఏం చేయాలి?" అన్నాడు రామచంద్రుడు. "సీతమ్మ కూరలు తరగాలి; లక్ష్మణుడు సరుకులు తేవాలి; ఆంజనేయుడు వంట చెరకు తీసుకు రావాలి" అన్నాడు. "మరి నేనో?" అన్నాడు రాముడు. "మీరు దేవుడు కదా! పూజా సామాన్లు అవీ సద్దితే చాలు" అన్నాడు. ఒకరోజున ఘుమ ఘుమలాడే పాయసం కాచి రాములవారి ముందు పెట్టి ఏడవటం మొదలు పెట్టాడు అజ్ఞాన్. "ఎందుకు ఏడుస్తున్నావు?" అని అడిగితే, "మా గురువుగారికి పాయసం ఎంతో యిష్టం" అన్నాడు. "మరి ఏం చేయాలి?" అన్నాడు రాముడు. "ఆంజనేయ స్వామి మిమ్మల్ని, లక్ష్మణుని భుజాన మోశాడు కదా! మీరు ఆదేశిస్తే ఆయన నన్ను కాశీకి చేరుస్తాడు" అన్నాడు అజ్ఞాన్. సరే ఆ విధంగా గురువుగారికి పాయసం యిచ్చి, తృప్తి చెందాడు. సమర్థుడు ఆంజనేయ స్వామి

అవతారం. గురుదేవులే అజ్ఞాన్ కోసం సీతారాములుగా సాక్షాత్కరించారు. సమర్థులు శిష్యులతో "మీరు కాశీకి వచ్చి పొందినదేమిటి? అజ్ఞాన్ అక్కడే ఉండి చేసిన సేవవల్ల పొందనది ఏమున్నది? సాక్షాత్ సీతారాములనే సాక్షాత్కరింప చేసుకున్నాడు కదా!" అన్నారు. మనకి శ్రీగురుదేవులతో ఎన్నో అనుభవాలు ఉన్నాయి. వాటిని మనసులో నెమరు వేసుకుంటూ ధ్యానంలో కూర్చుంటే ధ్యానం చక్కగా కుదురుతుంది. ధ్యానం చేసేవాడు, ధ్యానమూర్తి, లక్ష్యం వేరుకావు.

మనస్తే పాదాబ్జే నివసతు వచః స్తోత్ర ఫణితౌ
కరశ్చాభ్యర్చాయాం శృతిరపి కథాకర్ణన విధౌ ।
తవ ధ్యానే బుద్ధి ర్నయన యుగళం మూర్తి విభవే
పర గ్రంథైః కిం వా పరమశివ జానే పరమతిః ॥

"ఓ సదాశివా! నా మనస్సు, నా మాట, చెయ్యి, చెవి, బుద్ధి, కళ్ళు యివి క్రమంగా నీ పద కమలాల యందు, నీ స్తుతి యందు, నీ పూజ యందు, నీ కథా శ్రవణం యందు, నీ ధ్యానమందు, నీ దర్శనమందు, నీ సేవాదులయందు సంలగ్నమవుగాక! ఇక నా సర్వేంద్రియాలూ పరవిషయాలను ఎరుగకుండు గాక!"

ఎవరు ఎన్ని అన్నా భరించటానికి గురుదేవులున్నారు. అందుకని సాధనలో ఏ అవాంతరాలు వచ్చినా, వారికి చెప్పుకోవాలి. కృష్ణుడు కూడా అదే మాట అన్నాడు.

'స్వైరిణీ అన్నారు నన్ను శ్యామసుందరా! బృందావని నీదు రాగ బంధ మొదవ తరలితినని'..... మనం స్వామివారి రాగ బంధంలోనే ఉన్నాము. భయపడ వలసిన పని లేదు. మరి గురుదేవుల కోసం మనం అలా ప్రాకులాడుతున్నామా? వారు సూచించిన మార్గంలో ఉంటే మనం కూడా సగర్వంగా చెప్పుకోవచ్చు. మనల్ని మనం గుర్తించాలి. అప్పుడే ధ్యానం స్థిర పడుతుంది.

ధ్యాన స్థితిని గురించి మీకు ముంజవరపుకొట్టులో జరిగిన సంఘటన చెబుతాను. ఒకసారి బాబు ఆ ఊరికి వచ్చారు. వడాలిపిన్నిగారు ధ్యానంలో ఉంటే బాబు ఆమె జుట్టును లాగుతున్నారు. అలా ఎంతసేపు చేసినా ఆవిడ ధ్యాన స్థితిలోనే ఉండిపోయారు కాని కళ్ళు తెరవలేదు. అదీ ధ్యానస్థితి అంటే" అన్నారు బాబు.

గురుదేవులు చెప్పింది చేయకపోవటం వలనే మనల్ని భయం ఆవరిస్తుంది. భయం పోవాలంటే 'భగవంతుడు నావాడు' అనే భావన పూర్తిగా నింపుకోవాలి. మనలోనే బాబు ఉన్నాడు. బాబులో మనం ఉన్నాము అనే భావన కలిగి ఉండాలి. గురుదేవులను పూర్తిగా నమ్మాలి. నమ్మితే బంగారు పిచ్చుక! నమ్మకపోతే బూడిదే! అనేవారు శ్రీగురుదేవులు. భగవత్ప్రీతిలోనే మనం ఉన్నామనే గుర్తింపు ఉండాలి. అటువంటి పూర్ణప్రజ్ఞ, అనురాగం, భక్తి, గురుదేవులు మనకు ప్రసాదించెదరు గాక!!

*

# పిల్లల ఆధ్యాత్మిక కథ

– కొండ వెంకట రాజు

మన ఆశ్రమ విద్యార్థులు ఈ సంవత్సరం అసంబ్లీలో నేర్చిన కొన్ని ఆధ్యాత్మిక కథలకి చదువును జోడించి వారికి అర్థమయ్యే రీతిలో సరళ భాషలో చెప్పటం జరిగింది.

<u>సార్ –</u> అనగనగా ఒక గోడలు కట్టేవాడు ఉన్నాడు. వాడు ఇటుక మీద ఇటుక పేర్చి, సున్నం, ఇసుక కలుపుతూ గోడని ఎంత ఎత్తు కావాలో అంత ఎత్తుకి తీసుకు వెళ్తాడు. ఫస్ట్ ఫ్లోర్ అయిన తరువాత, సెకండ్ ఫ్లోర్, తరువాత థర్డ్ ఫ్లోర్ అలా ......కట్టుకుంటూ పోతాడు. ఇప్పుడు పెద్ద పెద్ద నగరాల్లో అయితే 40 ఫ్లోర్ల వరకూ వెడుతున్నాడు. అలా అలా ఎక్కడికి వెళ్ళిపోగలడు పిల్లలూ?

<u>పిల్లలు</u> – చాలా ఎత్తుకు వెళ్ళిపోతాడు.

<u>సార్</u> – అవును చాలా ఎత్తుకి వెళ్ళిపోగలడు. స్వర్గలోకాలకి, సత్యలోకాలకి, ఊర్ధ్వ లోకాలకి కూడా వెళ్ళిపోతాడు. పిల్లలూ! మీరు పెద్దయ్యాక ఆధ్యాత్మిక మార్గం పట్టాలి. సాధు మహాత్ములు చెప్పే ప్రవచనాలు, మంచి మాటలు విని గుర్తుపెట్టుకుని నిచ్చెనమెట్లు లాగా ఒకటీ ఒకటీ ఎక్కుతూ గోడలు కట్టే మేస్త్రి లాగ పైపైకి పోవాలి.

అనగనగా ఒక గోతులు త్రవ్వేవాడు ఉన్నాడు. వాడేం చేస్తున్నాడు?? కొంత గొయ్యి త్రవ్వి, క్రిందకి వెళ్ళి, యింకొంత క్రింద గొయ్యి త్రవ్వి యింకా క్రిందకి వెళ్ళి, యింకా లోతుకి త్రవ్వి అలా చాలా లోతుకి వెళ్ళిపోతున్నాడు. అలా ఎక్కడిదాకా వెళ్ళగలడు?

<u>పిల్లలు</u> – చాల చాల క్రిందకి పోతాడు.

<u>సార్</u> – అవును. చాల చాల అడుక్కుపోయి, చివరకి అధోలోకాలకి (నరకానికి) పోతాడు. ఎందుకని??

<u>పిల్లలు</u> – ........(సమాధానం లేదు. సైలెంట్‌గా అయిపోయారు)

<u>సార్</u> – వీళ్ళందరూ చెడ్డవాళ్ళు. మన వెనుక లౌక్యంగా గోతులు త్రవ్వేస్తారు. వాళ్ళ స్వార్థం కోసం మనల్ని గోతులోకి త్రోసేస్తారు. గొయ్యి త్రవ్వినవాడు కూడా చివరకి అదే గోతులోపడి మానవ జన్మను నిరర్థకం చేసుకుంటున్నాడు. భగవంతుడు యిటువంటి వారిని యిష్టపడడు. వీళ్ళు అపకారం చేసే అజ్ఞానులు. మనం పిల్లలం కదా! ఇంకా మీ బుద్ధులు కలుషితం కాలేదు. ఈ స్కూల్లో 10వ తరగతి వరకూ చదువుకోండి. మనం మంచి జ్ఞానవంతులమై గోడలు కట్టేవాడిలాగా పైకి పైకి పోదాము. సమాజానికి మకుటంగా ఉందాము. అప్పుడు సమాజం మనల్ని గౌరవిస్తుంది. ఇప్పుడు చెప్పండి పిల్లలూ! మీరు గోడలు కడతారా? గోతులు త్రవ్వుతారా?

<u>పిల్లలు</u> – (ముక్త కంఠంతో) మేము గోడలుకట్టే వాళ్ళమే అవుతాము.

<u>సార్</u> – గుడ్! అయితే మీరు బాగా చదువుకోవాలి. 500 పైనే మార్కులు తెచ్చుకోవాలి. మానవుడు సాధించాలనే పట్టుదల ఉంటే తప్పక సాధిస్తాడని పెద్దలు చెబుతున్నారు. అట్టి శక్తిని, భక్తిని, విద్యను మీకు శ్రీసద్గురుదేవులు ప్రసాదించెదరు గాక!!

# బుద్ధ జయంతి

R.T.C.లక్ష్మి

అసంఖ్యాక శతాబ్దాల మహోజ్వలమైన భారతదేశ చరిత్రలో జాతిని దైవం వైపు, ధర్మం వైపు నడిపించే దివ్యపురుషులు అవతారమూర్తులు ఈ పుణ్యభూమిలో అనేక సార్లు అవతరించారు. ఆ మహనీయులను మనం దైవాంశ సంభూతులుగా భావిస్తాము. వారు తమ దివ్యబోధలతో, ఆచరణతో, ప్రవచనాలతో మానవుల మానస క్షేత్రాలలో జ్ఞానజ్యోతులు వెలిగిస్తారు.

శాక్యుల రాజ్యమైన కపిలవస్తు యువరాజు సిద్ధార్థుడు. లోకంలోని శోకం చూసి చలించి ప్రపంచపు దుఃఖాన్ని తొలగించాలన్న తపన తీవ్రం కావటంతో సత్యాన్వేషణ తత్పరతతో సిద్ధార్థుడు సకలభోగ భాగ్యాలను - భార్యాపుత్రులను విడిచి పరివ్రాజకుడై ప్రపంచానికి కొత్తదారులు చూపి గౌతమబుద్ధుడు అయ్యాడు. సమరం సమస్యకు పరిష్కారం కాదని, అందువల్ల సమాజశాంతి విచ్ఛిన్నమవుతుందని, అహింసాధర్మాన్ని, ప్రేమతత్వాన్ని బోధించాడు తథాగతుడు.



క్రీస్తుపూర్వం 563సం॥లో లుంబినీవనంలో వైశాఖపూర్ణిమనాడు జన్మించిన సిద్ధార్థుడు బోధివృక్షం క్రింద తపస్సుచేసి జ్ఞానోదయం పొందాడు. లుంబినీవనంలో జన్మించి, బుద్ధగయలో జ్ఞానం పొంది 80సం॥లు నేల నాలుగు చెరగులా పర్యటించి ఆధ్యాత్మిక ప్రబోధాలతో జగతిలో జ్ఞానజ్యోతులు వెలిగించి, కుశినగరంలో మహానిర్యాణం చెందిన గౌతమబుద్ధుని సందేశం నేటికీ, ఏనాటికీ మానవాళికంతటికీ శిరోధార్యం.

సందర్శించవలసిన ముఖ్యమైన పవిత్ర స్థలాలు - 1. లుంబిని -బుద్ధుని జన్మస్థలం, 2. బుద్ధగయ - బుద్ధుడు జ్ఞానం పొందిన స్థలం, 3. సారనాథ్ - బుద్ధుడు తొలి ప్రవచనం చేసిన స్థలం, 4. కుశీనగరం - బుద్ధుడు మహానిర్యాణం పొందిన స్థలం. భారతదేశంలో బౌద్ధం నామమాత్రంగానే ఉన్నా, నేటికీ భూటాన్, చైనా, జపాన్, మయన్మార్, నేపాల్, సిక్కిం, శ్రీలంక, తైవాన్, థాయ్‌లాండ్, టిబెట్, వియత్నాం మొదలైన దేశాలలో ప్రముఖంగానే వెలుగొందుతోంది.

అయితే అశోక చక్రవర్తి బౌద్ధమత వ్యాప్తికిచేసిన కృషి విస్మరించరానిది. యుద్ధాలుచేస్తూ, రాజ్యాలు జయిస్తూ, శత్రుసేనలను హతమారుస్తూ విజయపథంలో కొనసాగుతున్న సామ్రాట్ అశోకుని మనస్సు మార్చింది బౌద్ధమతం. తన కుమార్తె సంఘమిత్రను బౌద్ధధర్మ ప్రచారంకోసం శ్రీలంకకు పంపాడు అశోకుడు.

ప్రపంచానికే విజ్ఞానకేంద్రంగా భాసిల్లిన నలందా విశ్వవిద్యాలయం బుద్ధుని

శిష్యులచే నెలకొల్పబడి అశోకునిచే అభివృద్ధి గావించబడింది. గౌతమ బుద్ధుడు తన జీవితంలో ఎన్నోసార్లు నలందను దర్శించి తన బోధలను వినిపించాడు. విద్యార్థులను ఉద్దేశించి ఎన్నో ప్రసంగాలను చేశాడు.

ప్రముఖ చైనా పండితుడు యాత్రికుడు హ్యూయన్‌త్సాంగ్ ఏడవ శతాబ్దంలో కొంతకాలం నలందలో గడిపాడు. ఆనాడే, చైనా, జపాన్, మంగోలియా కొరియా, టిబెట్, శ్రీలంక ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో విద్యార్థులు నలందాలో విద్యను అభ్యసించారు. 14హెక్టార్ల ప్రాంగణాన్ని యీ విశ్వవిద్యాలయ శిథిలాలు ఆక్రమించి ఉన్నాయి. ఈ ప్రాంగణంలో పట్టభద్రుల స్థాయి విద్యాసంస్థ, 6 విశ్వవిద్యాలయాలు, 8అంతస్థుల విహారాలు, 5 పెద్ద దేవాలయాలు, 3 పెద్ద గ్రంథాలయాలు ఉన్నాయి. ఈ ఆవాస సముదాయంలో పదివేల మంది పైగా విద్యార్థులు, రెండువేల మంది పైగా ఆచార్యులు బసచేసేవారు. తత్త్వశాస్త్రం, వ్యాకరణం గణితం, జ్యోతిషశాస్త్రం, వైద్యశాస్త్రం వంటి విషయాలను అధ్యయనం చేయటానికి సుదూర ప్రాంతాల నుండి ఎందరో విద్యార్థులను, విద్వాంసులను యీ విశ్వవిద్యాలయం ఆకర్షించింది.

నడిచినంతమేర ఆధ్యాత్మిక చైతన్యం నింపుతూ, మానవాళిలో అహింసా ధర్మాన్ని, ప్రేమభావనను, మానవీయ విలువలను ప్రోదిచేయటానికి ధర్మసంస్థాపనాయ అంటూ అవతరించిన ఆ అవతారపురుషుడు గౌతమబుద్ధుని పాదస్పర్శతో మరోమారు పులకరించింది భారతమాత.

*

**శ్రీసద్గురు ప్రసాదిత (50వ,) సర్ణోత్సవ శ్రీరాధాకృష్ణ జన్మాష్టమి మహోత్సవములు**
**శ్రీ సద్గురు భాగవత, అఖండనామ సప్తాహ, త్రయాహ్నిక సాధుధర్మ సమ్మేళన**
**సర్ణోత్సవ కార్యక్రమాలు**

***స్వస్తి శ్రీ చాంద్రమాన శ్రీ విజయనామ సంవత్సర శ్రావణ బహుళ సప్తమి అనగా ది.27-8-2013 మంగళవారం నుండి 2-9-2013 సోమవారం వరకు సప్తాహ దీక్షతో శ్రీకాళీవనాశ్రమము నందు పూజా కార్యక్రమములు జరుపబడును. కావున ఏవన్మంది భక్తులు కార్యక్రమములో పాల్గొని తరించవలసినదిగా కోరుతున్నాము.***

కార్యక్రమములు

సప్తాహ్నిక శ్రీకృష్ణ మూలమంత్ర హోమము, త్రయాహ్నిక సాధుధర్మ సమ్మేళనము, అఖండ సప్తాహ్నిక హరేరామ నామము, భాగవత ప్రవచనము, భగవద్గీతా పారాయణ ,మాతాజీవారిచే దివ్య అనుగ్రహ భాషణ ఉంటాయి.

2-9-2013న పూర్ణాహుతి, శ్రీరాధాకృష్ణుల సహస్రనామపూజ, శ్రీసద్గురుపాదపూజ జరుగుతాయి.

# అంతరంగ నివాసి

– రత్నం

శ్రీబాబూజీ మహరాజ్ దసరామహోత్సవాలలో మాట్లాడుతూ "పాపకర్ములు వైకుంఠం వెళ్ళగలరా? టికెట్ లేకుండా రైలులో ప్రయాణం చేసినట్లే, మధ్యలో ఎక్కడైనా దింపివేస్తారు. దండంతో మర్యాద చేసి మరీ దించుతారు. ఎందుకు? వైకుంఠం వెళ్ళటానికి కావలసిన పుణ్యం టికెట్ వాళ్ళ దగ్గర లేదు గనుక.



ఒకవేళ ఏలాగో చేరినా, అక్కడ టికెట్ కలక్టర్లు అంటే ద్వారపాలకులు బయటకు నెట్టివేస్తారు. అక్కడ ప్రభుత్వంలో మనకు మల్లే లంచాలు లేవు.

నేనెంతో తెలివిగలవాడినని, ఎవరికీ అందకుండా తప్పించుకుంటున్నాననీ మానవుడు అనుకుంటాడు. కాని తన మనస్సును దాచగలడా? భగవంతుని కన్ను మూయగలడా? మనస్సు రికార్డు చేస్తూనే ఉంటుంది. భగవానుడు చూస్తూనే ఉంటాడు. మరి వైకుంఠంలో స్థానం ఎలా వస్తుంది?

పునరపి జననం, పునరపి మరణం తప్పదు. ఎప్పుడు తన్ను తాను తెలుసుకుంటాడో అప్పుడే ఆ సర్కిల్ నుంచి బయటపడతాడు. ప్రశ్న ఉన్నంత వరకూ జవాబు ఉంటుంది. ప్రశ్న అంటేనే కర్మ. దానికి జవాబు జన్మ. ప్రశ్న లేకుండా పోతే జవాబు ఉండదు.

సద్గురువు లభిస్తే జన్మ సార్థకమవుతుంది. వారి దివ్య చరణారవిందాలు స్పృశిస్తేనే చాలు సర్వపాపాలు రహితమవుతాయి. అంతేకాని వారికి మన పాపాలు, మలినాలు ఏవీ అంటవు. మహాత్ములమని చెప్పుకొనేవారు కొందరు తమను ఎవరూ తాకటానికి ఒప్పుకోరు. తాకితే మైలపడ్డామని స్నానాలు కూడా చేస్తారు.

వారు బిందెలోని నీటివంటివారు. బిందెలో నీరు పదిమంది చేతులు పెడితే మలినమైపోతుంది. కాని నిజమైన మహాత్ములు పవిత్రమైన గంగానది వంటివారు. ఎందరు తాకినా, ఎన్ని మలినాలను పడవేసినా ఆ మలినాలన్నిటినీ పూర్తిగా హరించి శుద్ధి చేయగల పవిత్రత వారిది. వారికి మలినం అంటుతుందా? అగ్నికి మలినం ఎక్కడిది?

అంతరంగ నివాసియైన పాండురంగణ్ణి మనసారా స్మరించండి. మనస్సుతో చేసిన పాపాలన్నీ పోతాయి. నోటితో ఆ దేవుని నామస్మరణ చేయండి, చెప్పిన అబద్ధాలు, చేసిన పాపాలు పోతాయి. చేతులతో తాళం వేస్తే, ఆ చేత్తో చేసిన పాప కర్మలు, అప్రమాణాలు, అకార్య దోషాలు తొలగిపోతాయి. అట్టి భగవానుడు మిమ్ములను సర్వదా కాపాడు గాక! సుఖీభవ! సుఖీభవ!!

*

శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబు ట్రస్ట్ రెసిడెన్షియల్ స్కూలు
(ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ)
అతి తక్కువ ఫీజులతో, విద్యాబోధనతో నడుపబడుతున్న 'ఏకైక విద్యా సంస్థ'

అడ్మిషన్లు జరుగుచున్నవి

త్వరపడండి!

కొద్ది సీట్లు మాత్రమే ఉన్నాయి

విద్య అంటే విజ్ఞానము. అది అమ్మబడేది కాదు. కొనబడేది కాదు. అది అనుభవముతో కూడిన అధ్యాపకుల ద్వారా అందింపబడేది. నర్సరీ నుండి ఎల్‌యకె.జి తో సహా టెన్త్‌క్లాసు వరకు తెలుగు, ఇంగ్లీషు మీడియాలలో శిక్షణ ఇవ్వబడుతుంది.

## ప్రత్యేకతలు

2012-13 నుండి శ్రీచంద్రకాళీవిద్యానిధి 1మరియు 2 ప్రారంభం

120 మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, స్కూలు యూనిఫారములు, పాఠ్య పుస్తకములు

* ప్రశాంత వాతావరణము, ఆధ్యాత్మిక శిక్షణ
* క్రమశిక్షణ సత్ ప్రవర్తన
* రెసిడెన్షియల్ ట్యూటర్ల పర్యవేక్షణలో చదివించటము
* వీక్లీటెస్ట్‌లు, డైలీ అసైన్‌మెంట్లు
* డేస్కాలర్స్‌కి బస్సు సైకర్యము
* బాలబాలికలకు విడివిడిగా హాస్టల్ వసతి
* నర్సరీ నుండి 1వ తరగతి వరకు ఉచిత మధ్యాహ్న భోజనము అమలు.

సంస్కృత మరియు హిందీ పరీక్షలకు శిక్షణ

స్కాలర్‌షిప్‌లు పొందుతున్న విద్యార్థులకుఆ స్కాలర్‌షిప్‌ను డిగ్రీ వరకు కొనసాగించుట 'శ్రీచంద్రకాళీ విద్యానిధి' ప్రత్యేకత

మంచి విలువలతో కూడిన తెలుగు, ఇంగ్లీషు, హిందీ గ్రంథాలయము

కంప్యూటర్ ఎడ్యుకేషన్ మరియు సైన్స్ ల్యాబ్ సౌకర్యం కలదు.

<u>గమనిక</u> - స్కూలు ది. 3-6-2013న తెరువబడును. వివరములకు కరస్పాండెంట్ గారిని స్వయంగాగాని, ఫోన్ ద్వారాగాని సంప్రదించవచ్చు. లేదా వారికి వివరముల కొరకు వ్రాయండి.

డా॥ కె.వి. ఆర్ రమణ కరస్పాండెంట్
ఫోన్ - 0863 - 2594211 (ఆఫీస్)
0863 - 2293824 (ఇల్లు)
మొబైల్ - 94411 27078

# త్యాగశీలి

- చలం

విహంగ పట్టణంలో ఘటాకారుడు అనే కుమ్మరి ఉండేవాడు. అతను ధర్మపరుడు, బుద్ధిశాలి, కశ్యపబుద్ధుడి శిష్యుడు. బుద్ధుడికీ, బుద్ధుడి శిష్యులైన సాధువులకీ తనకు చేతనైనట్లు భోజనం పెడుతూ ఉండేవాడు. అతడు యింటి నుంచి బయటకు వెళ్ళినా, ఎవరైనా ఆకలిగొన్న సాధువులు వస్తారేమో అని యింట్లో భోజనం ఉంచి వెళ్ళేవాడు.



ఘటాకారునకు జ్యోతిపాలుడనే అనే బ్రాహ్మణ మిత్రుడు ఉన్నాడు. అతనూ చాలా పుణ్యాత్ముడు. కాని బుద్ధుడి శిష్యుడు కాడతడు. ఒకరోజు ఘటాకారుడు కుండల మట్టికోసం నదికి వెడుతూ ఉండగా జ్యోతిపాలుడు అతనితో కూడా నదికి బయలుదేరాడు.

"నేను ముందుగా బుద్ధదేవుడి దర్శనం కోసమై వెడుతున్నాను. నువ్వు కూడా నాతో వచ్చి ఆయన దర్శనం చెయ్యి. తరువాత నదికి వెడదాము" అన్నాడు ఘటాకారుడు. జ్యోతిపాలుడు నవ్వుతూ "ఆ బోడి స్వామితో నాకేమి పని?" అన్నాడు.

"అటువంటి మహాత్ముల మాటలు విన్నంతమాత్రాన నీకు పోయిందేముంది?" అన్నాడు ఘటాకారుడు. జ్యోతిపాలుడు "నీకు తెలుసు కదా! నాకూ, మా మతానికి చాలా దూరమని, నేను సంధ్యావందనమన్నా నేర్చుకోలేదు. నన్ను వెలివేసినవాడిలా చూస్తారు బ్రాహ్మణులు" అన్నాడు.

ఘటాకారుడు మాట్లాడుతూ "కాని బుద్ధదేవుడు పాత మతధర్మాన్ని బోధించరు. వాటిని నమ్మి నడుచుకునేవారు గుడ్డివారిని నమ్మి నడిచే గుడ్డివారు. కాంతి మనలోనే ఉంది అంటారు ఆయన" అన్నాడు.

"ఆ మాటలు ఆయన చెప్పాలా? మనకు తెలియనిదా ఏమిటి? కొత్తగా ఆయన దగ్గర నుంచి వినటానికి" అన్నాడు జ్యోతిపాలు. "నిన్ను ఏమి చెప్పి నమ్మించను? ఒకసారి ఆయన దగ్గరకు వస్తే తెలుస్తుంది. నీ జీవితంలో నువ్వు కోరుకునే ఆదర్శాలన్నీ ఆయనలో చూస్తావు.

"నీకిదో పిచ్చి. స్నానం చేద్దాం పద". ఇద్దరూ నదికి వెళ్ళి స్నానం చేశారు. బుద్ధభగవానుడు ఆరోజు స్నానంచేసి ఒడ్డునే కూర్చున్నారు. ఆయనను సమీపిద్దాం మంటే జ్యోతిపాలుడు రాలేదు. ఘటాకారుడు అతని మొలతాడు పట్టుకుని లాగాడు రమ్మనమని. తరువాత జుట్టు పట్టుకుని లాగాడు. విధిలేక కదిలాడు జ్యోతిపాలు.

ఘటాకారుడు అనుకున్నట్లే మైమరచిపోయి విన్నాడు జ్యోతిపాలుడు బుద్ధదేవుని మాటలు. అతని ముఖంలో కొత్త కాంతి ఆవరించింది. ఇంటికివెళ్ళే దారిలో జ్యోతిపాలుడు "నువ్వు చెప్పింది నిజమే. మనం ఏ ధర్మాన్ని పాటించాలి అనుకున్నామో అదే కాదు, దాన్ని మించిన అంతఃశాంతిని బోధిస్తున్నారు. మాటలలో చెప్పటానికి వీలుకాదు. ఆయన నుంచి అది మౌనంలో ఉపదేశమవుతోంది. నాకనిపిస్తోంది నేను త్వరలో బౌద్ధ సన్యాసిని అయిపోతాను అని. ఎట్లా కాగలను?" అని కళ్ళనీళ్ళతో గద్గద కంఠంతో అన్నాడు.

దానికి ఘటాకారుడు "నేను ముసలి తల్లిదండ్రులను పోషించాలి. మహనీయమైన భిక్షుక జీవితం, వాకిలిలేని స్వేచ్ఛానందం నాకు లేదు" అన్నాడు. తన మిత్రుడి గాఢ ప్రశంస పనిచేసి జ్యోతిపాలుడాశ్చర్య చకితుడయ్యాడు. "నాకు తెలియదు ఇంతవరకు. నీకు భిక్షుక జీవితంపై ఇంత వాంఛకలదని. నేనెంతో దిగులుపడుతున్నాను నీకై" అన్నాడు.

"నీకు బంధాలు లేవుగా? నువ్వు కాషాయధారివి కాకూడదా?" అన్నాడు ఘటాకారుడు.

"తప్పకుండా అవుతాను" అన్నాడు జ్యోతిపాలు.

"నాకెంతో సంతోషంగా ఉంది. నా చేతులతోనే నీకు కాషాయాన్ని ఇస్తాను. సరేనా?" అన్నాడు ఘటాకారుడు.

"సరే, కాని నీకెంత బాధో! నువ్వు వాంఛించే కాషాయాంబరాన్ని నాకివ్వాలంటే" అన్నాడు జ్యోతిపాలు.

"నేను కాకపోయినా, నా మిత్రుడు స్వేచ్ఛలోకి పోగలుగుతున్నాడు అని సంతోషిస్తాను" అన్నాడు ఘటాకారుడు.

జ్యోతిపాలు బౌద్ధ భిక్షువు అయినాడు. తరువాత కొద్దిరోజులలోనే బుద్ధదేవుడు భిక్షుక బృందంతో వారణాసి వెడుతున్నారని తెలిసింది. ఒకసారి కదిలారంటే సాధారణంగా ఆయన ఆ ప్రదేశానికి త్వరలో తిరిగిరారు. బుద్ధుడు వస్తున్నాడని విని వారణాసిరాజు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశాడు. చాతుర్మాస్యం వస్తోంది. ఆ నాలుగు మాసాలూ వారణాసిలోనే గడపమని బుద్ధదేవుణ్ణి, భిక్షువులను ప్రార్థించాడు రాజు.

"వీర్లేదు రాజా! చాతుర్మాస్యం ఇంకోచోట గడప నిశ్చయించాను" అన్నారు బుద్ధదేవుడు. రాజుకి ఆశ్చర్యమూ విసుగూ కలిగాయి. "నాకన్నా గొప్పగా మీకు ఏర్పాట్లు చేసి గౌరవించగలిగినవారెవరున్నారు? నా సేవ మీకు తృప్తిగా లేదా? ఏదైనా లోపం కలిగిందా?" అని సభికులవంక చుట్టూ చూశాడు గర్వంగా.

"విహంగ అనే పల్లెటూరిలో నీకన్నా ఆదరంగా చూసే మనిషి ఒకడున్నాడు"

అన్నాడు బుద్ధుడు. "అదేమిటి నాకంటె ధనవంతుడూ, భక్తిపరుడూ ఎవరున్నారు? మీకు తగిన వైభవంతో సౌకర్యాలు ఏర్పరచగలవాడు?" అన్నాడు రాజు. బుద్ధుడు రాజుకి ఘటాకారుడు గురించి చెప్పాడు. "మీకతడు ఎంత భక్తుడైనా మీ అందరికి ఏర్పాట్లు చేయగల స్తోమతు అతనికెక్కడిది? ఆ కుమ్మరికి?" అన్నాడు రాజు.

"నీకున్న ఐశ్వర్యంతో పోలిస్తే నువ్వు మా కోసం చేసిన ఏర్పాట్ల ఖర్చు ఎంతమాత్రం? దానిలో త్యాగమేమున్నది? కాని అతని బీద జీవితంలో అతనెంత త్యాగం చేసి, మాకు సపర్యలు చేస్తున్నాడో నీకేం తెలుసు? అంతేకాదు. తన తల్లి తండ్రులను పోషించటానికి, అతను సన్యాసి అయి నా వెంట తిరిగే తన జీవితాభిలాషనే త్యాగం చేశాడు" అన్నాడు బుద్ధ భగవానుడు.

ఆ మాటలతో రాజు కళ్ళు తెరుచుకున్నాయి. "స్వామీ! ఇప్పుడు తెలుస్తోంది. ఆహారము, బట్టలు, వసతులు ఇవ్వటం కన్నా గొప్ప త్యాగాలు ఉన్నాయని చూడగలుగుతున్నాను" అన్నాడు రాజు.

"అంతేకాదు రాజా! నేను వెళ్ళిపోతున్నానంటే నువ్వు గోల పెడుతున్నావు. కాని నేనతని నుంచి వచ్చేస్తుంటే, అతను తన దుఃఖాన్ని అణచుకుని, సంతోషంతో అంగీకరించి, తన కోసం తయారుచేసుకున్న కాషాయవస్త్రాన్ని తన మిత్రునికిచ్చి పంపించాడు" అన్నాడు రాజు.

"సేరే, అట్లాగే విహంగంలోనే చాతుర్మాస్యం చెయ్యండి. ఒక దానికి అంగీకరించండి. మీరు ఉన్నన్నాళ్ళూ నేను, కూరలు, ధాన్యము బండ్లతోటి మీ అందరికి సరిపడా ఆ ఘటాకారునికే పంపుతాను. ఆ పుణ్యమంతా ఘటాకారునికే చెందనీయండి. నేనేమీ కోరను" అన్నాడు రాజు.

"నాకూ, నా భక్తులకి భోజనం పెట్టే పుణ్యం ఆ ఘటాకారునికేమీ అవసరంలేదు రాజా. అతనికి వేరే విధంగా పుణ్యం అమితంగా వస్తూనే ఉంది. అతను వాంఛల్ని, ఆశల్నీ త్యాగం చేసుకున్నాడు. అతనికింక జన్మ లేదు. అతను కోరేది పుణ్యం కాదు" అన్నాడు బుద్ధుడు.

"మరి ఇంకేం కోరుతున్నాడు?" అన్నాడు రాజు.

"అంతఃశాంతి.ఆనందాన్ని దుఃఖాన్ని మించిన నిర్వాణాన్ని అందుకో చూస్తున్నాడు" అన్నాడు బుద్ధభగవానుడు.

ఆ మాటలు విని రాజు నిరుత్తరుడైనాడు. బుద్ధుడి పాదధూళి తీసుకున్నాడు.

సత్యం శరణం గచ్ఛామి! ధర్మం శరణం గచ్ఛామి! సంఘం శరణం గచ్ఛామి!

*



# బ్రజ్ మే రామధున్



-రమణ ప్రసాద్

శ్రీరామచంద్రకృపాళు భజ మన - హరణ భవ భయ దారుణం
నవ కంజలోచన కంజ ముఖ్ - పద కంజారుణం.....

అని సూరదాసు పాడుతూ ఉంటే అక్కడ ఉన్న భక్తులు ఆశ్చర్యంతో 'ఇదేమిటి సూరదాస్‌జీ! మీరు రామనామ స్మరణ చేస్తున్నారు?' అని అడిగారు.

సూరదాస్ - జో తులసీ కే రామ్ హై, జో రాధా కే కృష్ణహై, జో మీరా కే గిరిధర్‌హై, ఓహీ సూర్ కా శ్యామ్ హై. సబ్ ఏక్ హై. (ఎవరైతే తులసీదాసుకి రాముడో, రాధకి కృష్ణుడో, మీరాకి గిరిధరుడో, అతడే సూరదాసుని శ్యామసుందరుడు. వారిలో భేదం లేదు.

భక్తులు - సూరదాస్‌జీ! ఏమిటి విశేషం? ఎప్పుడూ బాలకృష్ణుని లీలలు పాడి మైమరచిపోయే మీరు ఈ రోజు ప్రత్యేకంగా తులసీదాసు కీర్తన పాడుతున్నారు?

సూరదాస్ - విశేషమే! ఈ రోజు తులసీదాస్ వ్రజభూమికి వస్తున్నాడు. ఆయన దర్శనం కోసం తహతహలాడుతున్నాను. ఆయన ఎప్పుడు వస్తాడా అని ఎదురుచూస్తున్నాను.

సురదాస్, భక్తులు -(కలసి పాడుతూ ఉంటే)

కందర్ప అగణిత అమిత భబి నవ నీల నీరద సుందరమ్।
వట పీత మానహు తడితరు శుచి. నౌమి జనక సుతా వరమ్।

ఇతి వదతి తులసీదాస... అని పాడుతూ ఉంటే తులసీదాసు భక్తులతో కలసి వచ్చి,

మైనహి మాఖన్ ఖాయో - మైనహి మాఖన్ ఖాయో
మయ్యా మోరీ మైనహి మాఖన్ ఖాయో...... అని పాడాడు.

సూరదాస్ - ఆనందంతో ఏమిటి తులసీదాస్‌జీ! మీరు బాలకృష్ణుని కీర్తన పాడుతున్నారే!

తులసీదాస్ - జో రాధాకె కృష్ణహై, జో సూర్ కా శ్యామ్ హై, ఓహీ తులసీకా రామ్‌హై. సబ్ ఏక్ హై. ఎవరు రాధకి కృష్ణుడో, ఎవరు సూరదాస్‌కి శ్యామసుందరుడో, అతడే తులసీదాసుని రాముడు.అతడే నా రాముడు. వారిలో భేదం లేదు.

సూరదాస్, తులసీదాస్, భక్తులు - (కోరస్‌గా) మై నహి మాఖన్ ఖాయో, మయ్యామోరీ మైనహి మాఖన్ ఖాయో... అని ఆనందంగా పాడతారు.



జో తులసీకా రామ్‌హై ఓహీ
సూర్‌కా శ్యామ్ హై.
ఎవరు తులసీదాసుని రాముడో, అతడే
సూరదాసుని శ్యామ సుందరుడు.



# సత్య సంపద

- సుశీలా ప్రసాద

సంపన్నుడైన రామస్వామి ఉదార స్వభావుడు, వివేక వంతుడు. ఆయన దగ్గర పనిచేసే వారిలో జాలయ్య ఒకడు. ఒళ్ళు దాచుకోకుండా పని చేస్తాడని తెలిసిన యజమాని అతడిని రవంత అభిమానంగా చూస్తుండేవాడు. అది, మిగిలిన వారి అసూయకి కారణమైంది. అవకాశం వస్తే వానిని అవమానించాలని వాళ్ళు ఎదురు చూస్తూ ఉండేవారు.

జాలయ్యకి ఒకసారి ఇంట్లో యిబ్బందులెక్కువై రామస్వామినడిగి కొంత పైకం బదులుగా తీసుకున్నాడు. త్వరలో బాకీ చెల్లిస్తానని మాట కూడ యిచ్చాడు. అయితే అన్న ప్రకారం తీర్చలేకపోయాడు. అప్పుడే తిండి గింజలు కూడా కరువైన సందర్భంలో, జాలయ్యకి రామస్వామి పొలాలలో పంట కుప్పలువేసి ఉండటం గుర్తువచ్చింది. తను అందులో రెండు బస్తాలు తెచ్చుకుంటే ఆయనకి లెక్కలేదనిపించింది. ఎవరూ చూడకుండా తెల్లవారుజామున కను చీకటివేళ ధాన్యం రెండుబస్తాలకెత్తి, బండిలో వేసుకుని యింటికి తిరిగి వస్తుంటే దారిలో ఉన్న బురద గుంటలో బండిచక్రం దిగబడి పోయింది. తన శక్తి కొలదీ అది పైకి లాగటానికి జాలయ్య ఎంతో ప్రయత్నించాడు. కాని సాధ్యం కాలేదు. తెల్లవారిపోతోంది. జాలయ్యకెంతో భయం వేసింది. ఎవరైనా సాయం చేస్తారా? అని అటూ యిటూ చూస్తుంటే, ఒక మనిషి చలికి ఒంటి నిండా దుప్పటి ముసుగు పెట్టుకుని వస్తూ కనిపించాడు. అమ్మయ్య! అనుకుని జాలయ్య వానిని పిలిచి కాస్త సాయం చేయమని అడిగాడు. అతను వెంటనే బలంగా చక్రం పైకెత్తి పెట్టి తనదారిన తను చక్కాపోయాడు. దైవకృప అనుకుంటూ యింటికి చేరాడు జాలయ్య.

ఆ మరునాడు రామస్వామి గుమాస్తా జమా ఖర్చుల లెక్కలు చూస్తూ జాలయ్య తీర్చలేకపోయిన ఋణాన్ని యజమానికి గుర్తుచేశాడు. అయినా ఆయన దాన్ని అంతగా పట్టించుకోకపోవటం చాటుమాటుగా నిలిచి ఉన్న మిగిలిన సేవకులు జాలయ్య మీద యజమానికి ఉన్న అభిమానంతో బాకీ రద్దుచేస్తాడేమో నన్న అసూయతో "మేము వెళ్ళి అతను యివ్వవలసిన డబ్బు వస్తూలు చేసుకొస్తామ"ని గుమాస్తాతో చెప్పి బయలుదేరారు.

జాలయ్య దగ్గరకు చేరి వాళ్ళు అదే అదను అనుకుని అతనికి యజమాని మీద లేనిపోని మాటలు కల్పించి, యజమాని "నేను కట్టించిన యింట్లో ఉంటూ, నా సొమ్ము తేరగా తింటున్నాడు. కొంచెం కరుడు పడేస్తే కుక్క కూడా తోక ఆడించుకుంటూ కూడా కూడా తిరుగుతుంది. దాని మాత్రం విశ్వాసం కూడా లేదా వాడికి. డబ్బు యివ్వకపోతే పెట్టె బేడా బయటపడేయ"మన్నారు అని చెప్పారు.

జాలయ్య విని నిశ్చేష్టుడు అయ్యాడు. "ఇంత పదునైన మాటలు యజమాని అనకపోతే వీళ్ళు యింత ధైర్యంగా ఎలాగ చెప్పగలరు!" అనుకుంటూ చెప్పుడు మాటలు

విని చెడిపోయే పాపచింతన మనస్సులో చిమ్మచీకటిలాగ అలుముకునే సరికి వానిలో వివేకం నశించింది. దుఃఖంతో పూడిపోయిన గొంతపెగల్చుకుని తను వస్తున్నానని వారితో చెప్పి వారిని పంపించివేశాడు. ఎంత ప్రయత్నించినా తరువాత వాని మనస్సు స్వాధీనంలోకి రాలేదు.

భార్యమెడలో మగిలి ఉన్న కాస్తంత బంగారం తీసుకుని రామస్వామి యింటికి వెళ్ళాడు. రామస్వామి ఎమిటన్నట్లు చూశాడు జాలయ్యవంక. ఏమీఎరుగనట్లుగా చూస్తున్నాడని యజమాని మీద మరింత రోషం, కోపం ముంచుకొచ్చాయి జాలయ్యకి. తల దించుకుని, బంగారం ఉన్న చేతిని ముందుకుజాపి, "తమరి బాకీ నిమిత్తం యీ బంగారం జమచేసుకోండి. ఇంకా యివ్వాల్సిఉంటే చెప్పండి" అని ఆగి, అంతదాక మనస్సులో గుణించుకుంటున్న మాటలను యీటెలలాగ వదలుతూ "ఇంక నేను తమరి పనిలో నుంచి తప్పుకుంటున్నాను గనక సెలవు దయచేయండి. మరోచోట కష్టపడి సంపాదించి తెచ్చి, తమకివ్వాల్సింది యిస్తాను" అన్నాడు. "అయితే వేరేచోట ఎక్కడైనా పని దొరికిందా నీకు?" అన్నాడు రామస్వామి. "లేదు లేదు ఇంకా చూసుకోవాలి" అన్నాడు జాలయ్య దీనంగా.

రామస్వామి నాలుగడుగులు నడిచి వాని దగ్గరగా వచ్చాడు. "ఇంతకు ముందు జరిగిన విషయమంతా విన్నాను. అసూయ ఓర్వలేనితనము ఎంతపనైనా చేస్తాయనే సత్యం గ్రహించాను. నీ సంగతి తెలిసిన వాడిని గనక  నీ మనస్సు అర్థం చేసుకోగలిగాను. నువ్వు విన్నమాటల్లో ఎంత నిజముందో ఆలోచించావా? నన్ను నమ్మినవాడివి యిలా తొందరపడి ఆవేశంలో నిర్ణయం తీసుకోవటమేనా? ఇది విను" క్షణం ఆగి రామస్వామి తిరిగి చెప్పసాగాడు.

"సత్యం గ్రహిస్తే మనస్సుకి శాంతి లభిస్తుంది. శాంతి నిండిన హృదయంలో దయ చోటు చేసుకుంటుంది. దయా వాహిని పొంగి పొరలగా అది ప్రేమగా వెల్లువలై ప్రపంచమంతా నిండి ప్రవహిస్తుంది. ఆ ప్రేమకి గుర్తు త్యాగమే" అంటూ రామస్వామి, జాలయ్య భుజం మీద చెయ్యి వేసి, అతనికి మాత్రమే వినబడేటట్లు "చూడునాయనా! ఇంకోచోట పనిలో చేరేముందు, తెల్లవారుజామున కను చీకటిలో బండి చక్రం బురదలో కూరుకుపోయిన సమయంలో సహాయంచేసి ఎత్తి పెట్టగల యజమానిని మాత్రం సంపాదించుకో!" అన్నాడు.

జాలయ్య స్థాణువై నిలబడిపోయాడు!!

*

# శ్రీవిజయ నామ సంవత్సరాది

- పూజ్యశ్రీ మాతాజీ

11-4-2013 గురువారం

అందరిలో ప్రకాశించే సర్వాంతర్యామి, సర్వశక్తి సంపన్నుడు, సర్వజ్ఞుడు, యీ రోజు 'విజయ' నామ సంవత్సర కాలస్వరూపుడు అయిన గురుదేవునికి నమస్కరిస్తూ.......... విజయనామ సంవత్సరం. ఇది వినటానికి సంతోషంగా ఉంది. వినికిడి వల్లనే సుఖదుఃఖాలు వస్తాయి. మంచి విషయం వింటూ, చెడుని ఉపసంహరించుకుంటూ ఉంటే మంచిగా మారతాము.

ఎవరు గురుదేవుణ్ణి స్మరించుకుంటూ ఉంటారో వారికి విజయం తథ్యం. ప్రహ్లాదుడు ఎన్నో కష్టాలు పడ్డాడు. అయితేనేమి ఏమైనా అనుకున్నాడా? లేదు. ఎందుకంటే నారదుడు ఉపదేశించిన నామాన్ని జపిస్తూ, తనకు కలిగిన కష్టాలను లెక్కపెట్టలేదు. మనం కూడా మానవ జన్మ వచ్చినందుకు, సద్గురువు సులభంగా లభించినందుకు గురుదేవుడు సూచించినదాన్ని ఆచరిస్తే అదే ధ్యానం అవుతుంది.

ఈ సంవత్సరం బాగుంది అంటాం. ఏ సంవత్సరం బాగుండలేదు? బాబు అంతటా వ్యాపించి ఉన్నారు. ఆయన లేని తావు లేదు. అది అనుభవించినవాడికే తెలుస్తుంది. మనం పంచాంగ శ్రవణం చేశాము. కందాయ ఫలాలు, ఆదాయ వ్యయాలు చూసుకున్నాము. ఏది ఎలా ఉన్నా మన కడుపు నింపేది, హృదయానికి శాంతినిచ్చేది ఆ సమర్థమైన గురుపాదమే!

మనం స్వామి సృష్టిలోనే ఉన్నాము అన్న విషయాన్ని మరువకూడదు. మన పోషణ బాధ్యత ఆయనదే. మన జీవితాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా చేసేది, జ్ఞానఫలాన్ని యిచ్చేది గురుదేవులే. ఆ జ్ఞానఫలం ఆస్వాదించిన కొద్దీ మధురంగా ఉంటుంది. అది అయిపోయేది కాదు.

అటువంటి నామామృతంలో, అటువంటి ఆస్వాదనలో, అటువంటి సద్గురు దేవుల చల్లని నీడలో గురుతత్త్వాన్ని గుర్తిస్తూ, ముందుకు సాగుదాము. విజయం మనదే! నూటికి నూరు శాతము మనదే!

శ్రీగురుదేవులు అట్టి భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను, అఖండ సాధనా సంపత్తిని ప్రసాదించి సర్వదా రక్షించుగాక! సుఖీభవ! సుఖీభవ!!

# గురువుకు పరీక్షా?

- జగం

గురువును పరీక్షించబోయి తామే తీవ్రమైన, బాధాకరమైన పరీక్షకు గురి అయితే ఎలా ఉంటుంది?

ఈ సంఘటన పశ్చిమగోదావరి జిల్లా భీమవరం దగ్గరి దిరుసుమర్రు గ్రామంలో జరిగింది. ఆ గ్రామంలో అనేకమంది శ్రీబాబును విశ్వసించారు. వారి బోధలను శ్రద్ధగా వినేవారు, చెప్పింది పాటించేవారు. కొంతమంది కుర్రవాళ్ళకు యీ పద్ధతి నచ్చలేదు. తమ పెద్దలంతా శ్రీబాబు మాయలో పడ్డారనీ, బాబు వాళ్ళను మోసగిస్తారనీ, అలా అయితే తమ భవిష్యత్తుకు నష్టమనీ ఆ కుర్రాళ్ళు భావించారు. 'దీనికి విరుగుడు చేయాలి, బాబు మాయలో నుండి తమ పెద్దవాళ్ళను బయటపడేయాలి' అనుకున్నారు. తాము చెప్పితే వినే స్థితిలో ఆ పెద్దవాళ్ళు లేరు. కాబట్టి శ్రీబాబుకు ఏమీ చేతకాదని నిరూపించి, తద్వారా ఆయన్ని ఆ ఊరిలో నుంచి తరిమివేయాలని అనుకున్నారు వాళ్ళు. ఏం చెయ్యాలి? ఆలోచించగా, ఆలోచించగా వారికి ఒక మార్గం కనబడింది. ఇంకేముంది! అమలు చేశారు.

ఒకరోజున శ్రీబాబు ఒక భక్తుని యింట్లో గదిలో ధ్యానం చేసుకుంటున్నారు. కొంతమంది కుర్రవాళ్ళు ఒక పాడెను మోసుకుంటూ, ఏడుస్తూ వచ్చి, ఆ యింటి ఎదురుగా దింపి, పెద్దగా ఏడుపులు, పెడబొబ్బలు మొదలు పెట్టారు. ఈ గోలకు శ్రీబాబు బయటకు వచ్చారు. "ఏమైంది? ఎందుకు అందరూ అలా ఏడుస్తున్నారు?" అని శ్రీబాబు వాళ్ళను అడిగారు.

పాడెమీద ఉన్నవాడిని చూపిస్తూ "బాబూ! వీడు మా స్నేహితుడు. పొలంలో ఉన్నట్లుండి పడిపోయాడు. నాడి కొట్టుకోవటం లేదు. వీడి తల్లిదండ్రులకు వీడొక్కడే సంతానం. వీడు చనిపోయినట్లు తెలిస్తే, వాళ్ళు భరించలేరు. మీకు చాలా శక్తులు, మహిమలు ఉన్నాయని విన్నాము. దయచేసి మీ శక్తితో వీడిని బ్రతికించండి బాబూ!" అన్నారు.

వారి పన్నాగాన్ని గ్రహించిన బాబు ఏమీ తెలియనట్లు అమాయకంగా " నాకు ఏ శక్తులూ లేవు. ఏం చేస్తాం పాపం! వీడిని తీసుకువెళ్ళిపొండి. మీరు వెళ్ళి వాళ్ళ పెద్దవాళ్ళకు కూడా యీ సంగతి చెప్పండి" అని, శ్రీబాబు తమ గదిలోకి వెళ్ళిపోయారు.

ఆకతాయి కుర్రవాళ్ళు సంతోషించారు. "తనకు ఏ శక్తులూ లేవని బాబే స్వయంగా చెప్పారు కాబట్టి యీ సంగతి తమ పెద్దవాళ్ళకు చెప్పి, వాళ్ళ నోర్లు మూయించవచ్చు" అనుకున్నారు. తమ ప్లాను చక్కగా ఫలించిందనుకున్నారు. పాడెమీద కప్పిన బట్ట తీసి, చచ్చినట్లు పడి ఉన్నవాడిని తట్టి లేపి, "ఒరేయ్! శవం లాగ భలే నటించావురా. చచ్చింది చాలుగాని లే. మన ప్లాను సూపర్‌హిట్. బాబు చెప్పింది నువ్వూ విన్నావుకదా! ఇంటికి పోదాం పద" అన్నారు. కాని వాడు లేవలేదు!

"ఛాన్సు దొరికింది కదా అని కుంభకర్ణుడిలా నిద్రపోతున్నావా? లేవరా సన్నాసీ!" అని వాడిని కుదిపారు. ఒకడు వాడి చెయ్యి పట్టుకుని లేపబోయాడు. చెయ్యి

మంచు ముద్దలాగా చల్లగా ఉంది. వారిలో కంగారు, వణుకు మొదలయ్యాయి. నాడి చూశారు అందలేదు. ఇంకొకడు గుండె దగ్గర చెవి పెట్టి చూశాడు. కొట్టుకోవడం లేదు. "అయ్యబాబోయ్! వీడి గుండె కొట్టుకోవటం లేదు. నిజంగానే చచ్చిపోయాడురా" అని అరిచాడు. ఇంకొకడు కంగారు పడి కనురెప్ప తెరిచి చూశాడు. "చూపు కూడా లేదురా" అన్నాడు భయంగా.

వీళ్ళ గోల విని, ఒక పెద్దాయన వచ్చి "ఏమిటిరా? ఏమైంది? ఆ పాడె మీద ఎవడు? ఎలా చచ్చిపోయాడు?" అని అడిగాడు. "వీడు నిజంగా చావలేదు బాబాయ్! చచ్చినట్లు నటించమన్నాము. బాబు బండారం బయటపెడదామని, పాడెమీద పడుకోబెట్టి, ఆయన దగ్గరకు తీసుకు వచ్చాము. ఆయనకు ఉన్న శక్తులు ఉపయోగించి బ్రతికించమని అడిగాము. తనకేశక్తులూ లేవని బాబు చెప్పారు. ఎంత లేపినా వీడు లేవటం లేదు. నాడి కూడా అందటం లేదు" అని ఆ కుర్రవాళ్ళు ఏడుస్తూ చెప్పారు.

ఆ పెద్దమనిషి కోపంగా "వెధవల్లారా! బాబుతో పరాచికాలా! ఆయన ఎవరనుకున్నారు? సాక్షాత్తు భగవంతుడు రా! ఆయన్నే పరీక్షిస్తారా! అడ్డగాడిదల్లారా! వెళ్ళి బాబు పాదాలమీద పడి, మిమ్మల్ని క్షమించమని, వీడిని బ్రతికించమని వేడుకోండి" అన్నాడు. "బ్రతికించలేనని బాబే అన్నారు కదా, బాబాయ్!" అన్నాడు వాడు. "నోర్మూయ్ వెధవా! బ్రతికి ఉన్నవాడిని ఎలా బ్రతికిస్తారు అనుకున్నావు? ఇప్పుడు నిజంగా చచ్చిపోయాడు కాబట్టి వెళ్ళి అడగండి. మీకే తెలుస్తుంది" అన్నాడు. ఆ లాజిక్ అర్థమయింది. తాము చేసింది తప్పు అని గ్రహించారు వాళ్ళు. వారందరూ కలిసి వెళ్ళి "బాబూ! బాబూ! దయచేసి ఒక్కసారి బయటకు రండి" అని ప్రార్థించారు.

బాబు వచ్చారు. అందరూ ఆయన పాదాలమీద పడి "బాబూ! మమ్మల్ని క్షమించండి. బుద్ధి గడ్డితిని మిమ్మల్ని పరీక్షించాలని, అవమానించాలని చూశాము. చాలా తప్పుడు పని చేశాము. మమ్మల్ని క్షమించి, వీడిని బ్రతికించండి" అని ఏడ్చారు, వేడుకున్నారు, లెంపలు వాయించుకున్నారు.

"మీ మీద నాకు ఏమీ కోపం లేదు నాయనా! మీ మనస్సులు యింకా పరిపక్వం చెందలేదు. అందుకే అలా చేశారు. ఇప్పుడు మీ తప్పు మీరు తెలుసుకున్నారు" అని "లోపల టేబుల్ మీద ఒక గ్లాసు ఉంది, దాన్ని తీసుకురా" అని ఒకడికి చెప్పారు. వాడు తెచ్చిన గ్లాసులోని నీళ్ళు పాడెమీద ఉన్న వాడిమీద చల్లి, 'లేవరా!' అన్నారు బాబు. వాడు నిద్రలో నుంచి లేచినట్లు లేచాడు. స్నేహితులు అందరూ సంతోషించారు. మొఖాలు వికసించాయి. జరిగిన సంగతి వాడికి చెప్పారు. "నిజంగానా! నేను చచ్చిబ్రతికానా" అంటూ వాడుకూడా శ్రీబాబు పాదాలపై పడి, "నన్ను క్షమించండి బాబూ!" అంటూ కన్నీటితో బాబు పాదాలను అభిషేకించాడు.

"లే! ఫరవాలేదులే. ఇక ముందు అందరూ జాగ్రత్తగా ఉండండి. భగవంతుణ్ణి విశ్వసించండి. మీకు అంతా మేలే జరుగుతుంది" అని శ్రీబాబు అందరినీ ఆశీర్వదించారు. 'జై! జై! సద్గురు మహరాజ్ కీ జై!' అని మిత్రులందరూ ఎలుగెత్తి చాటారు.

*

## శ్రీసద్గురు పుణ్యారాధన రజతోత్సవ వేడుకలు

## అందరూ ఆహ్వానితులే!

శ్రీసర్వాధిష్ఠాన చైతన్య విశ్వమత ప్రవక్త సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీవర ప్రసాద బాబూజీ మహరాజ్‌వారి రజతోత్సవ పుణ్యారాధనములు కాళీవనాశ్రమ పీఠాధిపతి పూజ్య యోగిని శ్రీ చంద్ర కాళీప్రసాద మాతాజీ వారి ఆధ్వర్యంలో శ్రీకాళీవనాశ్రమం (శ్రీకాళీగార్డెన్స్), నంబూరులో ది. 20-11-2013 బుధవారం నుండి ది. 1-12-2013 ఆదివారం వరకు పంచయజ్ఞ విధులతో జరుపబడును. నిత్యమూ శ్రీగురుగీతా ప్రచనము, శ్రీసద్గురు శతసహస్ర నామార్చనలు, మహామంగళ హారతులు ఉంటాయి. డిసెంబర్ 1వ తేదీ ఉదయం మహాభిషేకం, మహామంగళహారతి, దీక్షావిరమణ.

విశేష కార్యక్రమాలు -

నవంబర్ 20 నుండి బ్రహ్మశ్రీ కొండూరి రామబ్రహ్మంగారి ఆధ్వర్యంలో హోమము జరుగును.

నవంబర్ 24, 25, 26 తేదీలలో సాధుధర్మ సమ్మేళనము.

నవంబర్ 27న యతి పూజలు.

ఈ ఉత్సవాలలో అఖండ హరినామ సంకీర్తన, సామూహిక సద్గురుపాద పూజలు, నౌకావిహారము, ఊంజల సేవ, నగరోత్సవములు ఉంటాయి.

ఈ కార్య క్రమాలలో ప్రతి భక్త హృదయము పాల్గొనాలని మా ఆకాంక్ష. ఈ కార్యక్రమాలలో పాల్గొనుటకు వీలుగా శలవు పెట్టుకునేందుకు ముందుగా తెలియచేయుచున్నాము.

వివరములకు -

ట్రస్ట్ కార్యాలయము - 0863 2293564

కుమారస్వామి రాజా - 93465 35357

మురళీమోహనవర్మ - 93983 34345

ఎ. కుమారస్వామి - 93945 35357

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

గత సంచిక తరువాయి – విజయేశ్వరానంద ప్రసాద్

## చిరంజీవిరాజుగారితో శ్రీబాబు

తరువాత భక్తులందరితో కలసి, శ్రీబాబు శ్రీశైలం చేరుకున్నారు. కార్తీక పూర్ణిమ నాడు భక్తులందరూ శ్రీసద్గురుపాదపూజ చేసుకున్నారు. మరునాడు శ్రీ మల్లికార్జున స్వామికి సహస్ర ఘటాభిషేకము, లక్షబిల్వార్చన జరిగాయి. ఆ మరునాడు జగన్మాతకు లక్ష కుంకుమార్చన జరిగింది. సుస్తీ వలన రాజుగారు కార్యక్రమానికి రాలేక పోయారు. శ్రీబాబు రాఘవమ్మగారితో పూజ చేయించారు.



బహుళ తదియనాడు రాజుగారికి సుస్తీ బాగా ఎక్కువైంది. వైద్యం వలన కూడా ప్రయోజనం కలుగలేదు. రాజుగారికి అవసానదశ సమీపించిందని ముందుగానే తెలిసిన శ్రీబాబు, ఆ రోజు సాయంత్రం శ్రీబాబు రాజు గారి దగ్గరకు వెళ్ళి కాసేపు కూర్చున్నారు. రాజుగారు ప్రశాంతంగానే ఉన్నారు. "మనస్సులో ఏదైనా ఉంటే చెప్పు" అన్నారు బాబు.

శేషమాంబగారిని, రాఘవమ్మను. చంద్రను పిలిపించమని సైగ చేశారు రాజుగారు వారు ముగ్గురూ రాగానే వారి చేతులను శ్రీబాబు చేతులో ఉంచి, వారి రక్షణ భారం శ్రీబాబుకి అప్పగించారు. గురుపాదసేవ చేసుకుని తరించవలసినదిగా సైగలతోనే వారికి సూచించారు. ఇక తనకు ఎట్టి కోరికలు లేవనట్లుగా సూచించి, శ్రీబాబు పాదాలను కనులకద్దుకుని స్వామి చేతిని తమ హృదయంపై పెట్టుకున్నారు.

అప్పుడు శ్రీబాబు "చిరంజీవీ! ఒక పుణ్య క్షేత్రంలో సద్గురుదేవుని సన్నిధిలో నీ దేహం చాలించాలని ఒకప్పుడు నీవు కోరుకున్నావు. ఈ దేహమే శ్రీశైల క్షేత్రం. ఇందులోని జీవుడే మల్లికార్జునుడు. 'దేహో దేవాలయ ప్రోక్తః జీవోదేవ సదాశివః' (స్కందోపనిషత్తు). భక్తులందరూ ఆ పరమశివుని స్వరూపులే. ఆ పరమ శివుడే సద్గురువు. గురుదేవుని కృపవలనే మానవుడు తనలోను, అందరిలోను, అంతట ఆ పరమశివునే దర్శించగలుగుతాడు. నీకు అట్టి అనుభూతి కలుగుతోందా? నీకోరిక తీరిందా?" అన్నారు.

రాజు గారు అవునన్నట్లు తల ఊపారు. "చిరంజీవీ! నీవు ఇక నిశ్చింతగా ఉండు. శివతారకాన్ని జపిస్తూ, మనస్సు సద్గురు చరణార విందాలయందే నిలుపు" అని రాజుగారికి శ్రీబాబు చెప్పారు.

మనస్సు పరమ ప్రశాంతి పొందిన రాజుగారు శ్రీబాబు చూపులో చూపు నిలిపి అలాగే ధ్యాన నిమగ్నులైనారు. “ఎలా ఉంది?” అని శ్రీబాబు అడిగారు. “బ్రహ్మానందంగా ఉంది. శివదర్శనమవుతోంది బాబూ!” అని రాజుగారు హీనస్వరంతో అనగలిగారు. “అదే ధ్యానంలో ఉండు” అని శ్రీబాబు కొంతసేపు తాము ధ్యాన నిమగ్నులై ఉండి, తరువాత వెళ్ళిపోయారు. శ్రీబాబు విషణ్ణ వదనులై తమ గదికి వచ్చి, తలుపులు వేసుకొని ఉండిపోయారు. కొంతసేపటికి శేషమాంబగారు ఆవేదన పడుతూ వచ్చి, ‘బాబూ! చిరంజీవి పలకటం లేదు’ అంటూ తలుపు తట్టారు. శ్రీబాబు తలుపు తీయలేదు. కాని లోపలి నుండే “చిరంజీవి ఇక పలకడమ్మా! శివునిలో కలిసిపోయాడు” అని డగ్గుత్తికతో శ్రీబాబు అన్నమాటలు మాత్రం శేషమాంబగారికి వినిపించాయి.

మరునాడు భక్తులందరూ సంకీర్తన, ఉపనిషత్పారాయణ, గీతాపఠనము జరుపుతుండగా శ్రీశైలదేవ స్థానానికి సమీపంలోనే చిరంజీవిరాజుగారి దేహానికి అంత్యక్రియలు జరిగాయి. అక్కడే ఒక స్మారక చిహ్నం కూడా నిర్మింప బడినది.

– సశేషం

## ఎందరు దేవతలు?

బృహదారణ్యంలో శాకల్యుడికీ, యాజ్ఞవల్క్యునికి దేవతల సంఖ్య గురించిన చర్చ వచ్చింది.

శా – యాజ్ఞవల్క్యా! దేవతలు ఎందరు?

యా – మూడువేల ముగ్గురు.

శా – నిజంగానా?

యా – మూడు వందల ముగ్గురు.

శా – నిజంగా ఎందరు?

యా – ముప్ఫై ముగ్గురు.

శా – నిజంగా ఎందరు?

యా – ఆరుగురు.

శా – నిజంగా?

యా – ముగ్గురు.

శా – సత్యమా?

యా – ఇద్దరు.

శా – నిజమా?

యా – ఒకటిన్నర.

శా – నిజంగానా?

యా – ఒక్కడు.

శా – నిజంగానా?

యా – ఒక్కడే!

# శ్రీ రాధామాధవ రససుధ

- శ్రీ హనుమాన్ ప్రసాద్ పోద్దార్

శ్యామ సుందరా! కమలదళ లోచనా! దుఃఖమోచనా! వ్రజకిశోరా!
చిత్తచోరా! నా హృదయ మందిరంలో నిన్ను నిరంతరం చూడనిమ్ము.



లోకమానవుల మర్యాదలనే అవరోధ శైలాలన్నిటినీ పిండిపిండి చేసి, నిన్ను సదా నా పజ్జనే ఉంచుకొన నిమ్ము. లిప్తమాత్రమైనా నిన్ను కొంచమైనా దూరానికి పోనివ్వను.

నేను వట్టి గ్రామీణ గోపికను, గుణరహితను,
కళంకినిని, నిత్యకురూపిని,
నీవు అతిచతురుడవు, గుణాలఖనివి, కులభూషణుడవు,
సౌందర్యమూర్తివి,
నేను రసజ్ఞాన రహితను, రసవర్జితను;
నీవు రసనిపుణడవు, రసికలోక మకుటమణివి,
అయినా దయాసింధో! నీవు నా హృదయంలోనే సదా విరాజిల్లుతూ ఉంటావు.

నీ
రాధ

## విరహ వేదన

ఒకసారి ఒక గురువుగారు తమ శిష్యులతో తమ కుటీరంలో సత్సంగం జరుపుతున్నారు. అది చాలా చలికాలం వల్ల వారు తమ మధ్యలో ఒక ధునిని ఏర్పాటు చేసుకున్నారు. ఆ ధునిలోని ఒక కట్టెపుల్ల మెల్లగా కాలటం, గురువుగారు చూశారు. కట్టెపుల్ల కొంచెం తడిసినందున దాని రెండవ చివర ద్రవము కారుతోంది. ఒకటి రెండు క్షణముల తరువాత గురువుగారు తన శిష్యులతో యిలా అన్నారు "పరమాత్మ పట్ల ఎంతో భక్తి ప్రేమలు కలిగియున్నట్లు మీరంతా చెప్పుకుంటారు. విరహవేదనతో మీరెప్పుడైనా నిజంగా తపించారా? మీ కన్నులలో నాకు తపనగానీ, అశ్రువులు గానీ, కనిపించటం లేదే. ఈ కట్టెపుల్ల ఎలా మండుతున్నదో, ఎలా నీరు కారుస్తుందో చూడండి.తుచ్ఛమైన యీ కట్టెపుల్లను చూసి మీరు గుణపాఠం నేర్చుకోండి" అని తమ అమృత వాక్కులతో ఆశీర్వదించారు.

<u>సామెత</u> – ప్రాతఃకాలపు ఉపాసన మరియు రాత్రులందు ప్రభువు వియోగంతో విలాపము. ప్రభు ప్రాప్తియనే బొక్కసానికి తాళపు చెవి.

విష్ణు  కథలు

గతసంచిక తరువాయి

-రమణ ప్రసాద్

# జ్ఞానదేవుడు

సచ్ఛిష్య సాంప్రదాయం వెలకొల్పటానికి సద్గురువులే దర్పణంలో ప్రతిబింబించే ప్రతిబింబమువలె తమ ప్రతిబింబమైన శిష్యునిగా అవతరిస్తారు. నిద్రలో ఉన్నవాడు మరొక నిద్ర పోయే వాడిని మేల్కొల్పలేడు. మెలకువతో ఉన్నవాడే మేల్కొల్పగలడు. శ్రీ సద్గురుదేవులు సదా జాగరూకులు. సదా మెలకువలో ఉండి అజ్ఞానం అనే నిద్రలో ఉన్న తమ ప్రతిబింబరూపమైన శిష్యునికి బోధించటం ద్వారా తమకు తామే బోధించుకుంటారు. శిష్యరూపంలో తామే గ్రహిస్తున్నట్లుగా, అజ్ఞానమనే నిద్ర నుండి మేల్కొన్నట్లుగా వ్యవహరిస్తారు.



నిర్జనారణ్యంలో ఒకడు నిద్రనుంచి లేచినప్పుడు, అంతకు ముందు మేల్కొన్న వాడిలాగా, తర్వాత నిదురించనివాడిలాగా, ఆ తర్వాత మళ్ళీ మేల్కొన్న వాడిలాగా వ్యవహరించినా ఆ మూడు స్థితులలో ఒక్కడే అయినట్లుగా శ్రీ గురుదేవులు ఒక్కరే గురువుగా, శిష్యుడిగా (లీలాస్థితిలో) వ్యవహరింప బడుతున్న గురుశిష్య సంబంధంలో ద్వైతం అనేది లేదు. అద్వైతానికి భంగం రాదు.

వారి నామము నివృత్తినాధ్. నివృత్తి వారి ప్రతిభ. నిరంతరం నివృత్తిలో ఓలలాడుతూ ఉంటారు. ప్రవృత్తి వదలి గురూపదేశం ప్రకారం నడిచిన వారికి నివృత్తి మార్గం లభిస్తుంది. సూర్యాస్తమయం తర్వాత రాత్రి, రాత్రి అంతం అవగానే సూర్యోదయం అయి సూర్యుడు జీవులను ప్రవృత్తులుగా చేస్తాడు. కానీ శ్రీ సద్గురుదేవులు అలాకాదు. తమ బోధామృతాన్ని గ్రోలిన వారందరినీ నివృత్తి మార్గంలో పయనింపచేస్తారు. ఒక్కసారి శ్రీ సద్గురుదేవుల కృప పొందాక మళ్ళీ ప్రవృత్తి మార్గంలో పడరు.

రత్నానికి స్వయం ప్రకాశించే స్వభావం ఉన్నా దానిని పుటం పెట్టి సాన పెట్టాలి. సాన పెట్టిన కొలదీ అది ప్రకాశిస్తుంది. కాని సద్గురుదేవులు అలాకాదు. 'నీవు సుగంధానివి, నీవు పరిమళాన్ని విరజిమ్ము అని నాసిక అడగకుండానే పుష్పం తన సహజ స్వభావంగా ఎలా విరజిమ్ముతుందో సూర్యుడిని నీ ప్రకాశాన్ని లోకానికి ఇయ్యి

అని ఎవరూ చెప్పకుండానే జగత్తు అంతటికి వెలుగును ప్రకాశిస్తున్నాడో అదే విధంగా శ్రీ సద్గురుదేవులు సహజంగా, స్వభావసిద్ధంగా, స్వయంగా ప్రకాశిస్తారు. పూర్ణిమనాటి వెన్నెలలా, శ్రీ సద్గురుదేవుల ప్రకాశం అమృత మయంగా ఆహ్లాదకరంగా ఉంటుంది. శ్రీ సద్గురుదేవులు తాము స్వయంగా ప్రకాశిస్తూ అందరినీ ప్రకాశింపజేస్తారు. వారు స్వయంభువులు, స్వయంప్రకాశులు. స్వయం ప్రకాశం శ్రీ నివృత్తినాథుల స్వతఃసిద్ధమైన స్వభావం. అట్టి శ్రీ సద్గురుదేవుల పాద పద్మాలకు నమస్కరిస్తున్నాను.

శ్రీ జ్ఞానదేవులు అంటున్నారు "అట్టి గురుదేవులకే ప్రణిపాతం చేసినవారిని తెలిసి కొనగలిగాను కాబట్టి ఆయన ఋణాన్ని తీర్చుకొన్న వాడిని అయినాను" అని శ్రీ సద్గురుదేవుల బోధామృతాన్ని యథాతథంగా అర్థం చేసుకొని ఆచరించటమే వారి ఋణం తీర్చుకొనటం.

**<u>ఛాంగదేవుడు జ్ఞానదేవుని చూడవచ్చుట</u>**

ఛాంగదేవుడనే యోగీశ్వరుడు ఉండేవాడు. అతడు యోగమార్గంలో పయనించి అనేక సిద్ధులు గడించాడు. జ్ఞానదేవులవారు పరిసర ప్రాంతానికి వచ్చి ఉన్నారని తెలసి జ్ఞానదేవులవారిని దర్శించాలని అభిప్రాయపడ్డాడు. జ్ఞానదేవులకు ఉత్తరం వ్రాయటానికి ఉపక్రమించాడు. జ్ఞానదేవులవారిని ఎలా సంబోధించాలో అర్థం కాలేదు. "పూజ్యులు" అని సంబోధింటానికి అహంకారం అడ్డం వచ్చింది. "చిరంజీవి" అని అంతటి జ్ఞానిని సంబోధించటం సభ్యతకాదు అనిపించింది. ఏమి వ్రాయాలో తోచక ఖాళీ ఉత్తరాన్ని జ్ఞానదేవుల వారికి ఇవ్వమని శిష్యుని పంపారు.

జ్ఞానదేవులు ఆ ఉత్తరాన్ని తీసుకుని చూశారు. విషయాన్ని అర్థం చేసుకొని బిగ్గరగా నవ్వారు. "ఛాంగదేవుడు ఇంకా ఖాళీగా ఉన్నాడన్న మాట" అంది ముక్తాబాయి. ఛాంగదేవునికి జ్ఞానబోధ చేస్తూ ఆ ఉత్తరం లోనే 64 శ్లోకాలు వ్రాసి పంపారు. దానినే శ్రీ ఛాంగదేవ పాసష్టి అంటారు.

***<u>ఛాంగదేవ పాసష్టి</u>***

ఓ ఛాంగదేవా! నీకు జయం కలుగుగాక! కళ్యాణమస్తు! పరమాత్మ పరోక్షంగా ఉంటూ ఈ ప్రపంచాన్ని భాసింపజేస్తాడు. పరమాత్మ ప్రకటితమైతే ఈ ప్రపంచం లేనిదిగా అవుతుంది. పరమాత్మ కనపడేవాడు కాదు, కనపడనివాడూ కాదు. త్రిగుణాతీతుడు. పరమాత్మ దృష్టి పెరిగితే జగత్తుపై దృష్టి తగ్గుతుంది.

పరమాత్మ సర్వత్రా వ్యాపించి ఉన్నాడు. బంగారంతో నగలు చేస్తారు. ఆ నగలలో బంగారత్వం లోపించదు. అదేవిధంగా పరమాత్మ ఇన్ని ఆకారాలు, రూపాలు, నామాలు ధరించినా పరమాత్మలో ఎక్కడా లోటు రాదు. నీళ్ళు అలలవలె కనపడినా అది నీరే. ఇదే విధంగా పరమాత్మ, జగత్తు ఈ రెండూ వేరు కాదు. భూమి

పరమాణువులచే నిర్మింపబడింది. అలా అని పృథ్విని పరమాణువు అనలేము. కాని దాని పృథ్విత్వానికి ఎక్కడా లోపంరాదు.

జగత్తుచేత పరమాత్మ కప్పబడదు. ఛాంగదేవా! అజ్ఞానం(అవిద్య) వలన జ్ఞాని స్వరూపమైన ఆత్మ వేరుగా భాసిస్తుంది. నేను ద్రష్టను అది దృశ్యం అన్న మాయా కల్పన కలుగుతుంది. ఛాంగదేవా! నాకు మాత్రం వేరుగా కనబడటంలేదు. పోనీ ఇది చూడు! ఒక వస్త్రాన్ని కొందరు 'చీర' అంటారు. కొందరు 'పంచె' అంటారు. వాస్తవానికి అందులో ఉండే దారం ఒకటే కదా. అలాగే మట్టి, మట్టికుండ వేరుకావు. కనుక భేద దృష్టి వదలెయ్యి.

వాస్తవానికి చూసేవాడు (ద్రష్ట), చూడబడేది (దృక్, దృశ్యము) ఈ రెండూ లేనివే. పరమాత్మ వీటికి అతీతుడు. వ్యవహారంలో ద్రష్ట, దృశ్యము రెండూ ఉంటాయి. ఎన్ని రకాల నగలు ఉన్నా అందులోని బంగారం ఒక్కటే.

ఈశ్వరుడు నుండి పాషాణం వరకు కనిపించే ప్రతి పదార్థాన్ని గురించి తెలిపేది జ్ఞానం. జగదాకారం తో కనిపించే ఈ జ్ఞానం నిజానికి పరమాత్మ ఉనికి వల్ల కలుగుతున్నా దానిని పరమాత్మ అనం. జగత్తు అంటాం. బెల్లం అచ్చు రూపంగా ఉన్నా ముక్కలు చేసినా దాని రుచి మారదు. అదేవిధంగా ప్రపంచం నానా విధాలుగా కనిపించినా అందులో ద్వైతం లేదు. విశ్వాత్మ దృష్టి నశిస్తే ఆత్మదృష్టి మిగులుతుంది.

అవిద్య (అజ్ఞానం) వల్ల పరమాత్మ ద్రష్టగా, దృశ్యంగా కనిపించినా, పరమాత్మ, జగత్తు రెండుగా కనిపించినా, వాస్తవానికి అవి రెండు కాదు. ద్రష్ట, దృశ్యం, దృష్టి ఈ త్రిపుటి కేవలం పరమాత్మ ఉనికి వల్లనే కలుగుతుంది. అద్దంలో చూసేవాడు తన రూపాన్నే తిలకిస్తాడు. అదే విధంగా అవిద్య వల్ల ద్రష్ట దృశ్యం అనే భావం కలుగుతుంది. కాని వాస్తవానికి ద్రష్ట, దృశ్యం, దృక్ అనే మూడూ లేవు. అదే అఖండ స్థితి, అభేద స్థితి. ఆత్మజ్ఞానం కలిగితే ఈ త్రిపుటి నశిస్తుంది. అద్దం ఉన్నప్పుడు, లేనప్పుడు ముఖం ఉన్నచోటే ఉంది. ద్రష్ట, దృశ్యం కన్న భిన్నంగా ఉండే వస్తువు మనమే సుమా!

–సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL